





# విజయభాను




విశాఖపట్నం, శనివారం 28-10-2023 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 48 సంచిక : 42 పేజీలు : 08 వెల : 1 రూపాయి




## నగరాలు, పట్టణాల్లో రోడ్లపై దృష్టిపెట్టాలి


### ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అమరావతి, (విజయభాను న్యూస్) : పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష చేపట్టారు. ఈ సమావేశంలో మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి, స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి. కోటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అర్బన్ రీ సర్వే ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ బి సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్ జె విద్యుల్లత, ఏపీజీబీసీఎల్ ఎండీ బి రాజశేఖరరెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, కర్నూలు, కడప, తిరుపతి, గుంటూరు సహా వివిధ కార్పొరేషన్లలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టనున్న ప్రాజెక్టులపై సీఎం జగన్ సమగ్రంగా సమీక్షించారు. వర్షాకాలం ముగిసి పనుల సీజన్ మళ్లీ మొదలైనందున నగరాలు, పట్టణాల్లో రోడ్లపై దృష్టిపెట్టాలి. త్వరగా రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి. నీటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి. సముద్రతీరం వెంబడి వస్తున్న పరిశ్రమలు సముద్రపు నీటినే డీ శాలినేషన్ చేసి వినియోగించేలా చూడాలి. విశాఖ నగరంలో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నిర్వహణ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. భవిష్యత్తులో జనాభా పెరుగుతున్నందున పౌరులకు అసౌకర్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి. ముడసర్లోవ పార్క్ అభివృద్ధి, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీ లెవల్ కారు పార్కింగ్, భీమిలి, గాజువాక, అనకాపల్లిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి. విజయవాడలో అంబేద్కర్ స్మృతివనం పనులను వేగతవంతం చేయాలి. కన్వెన్షన్ సెంటర్, గ్రీనరీ పనులను వేగవంతం చేయాలి. విమానాశ్రయానికి వెళ్లే మార్గం వెంబడి సుందరీకరణ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. కృష్ణానది వెంబడి నిర్మించిన రక్షణగోడ వద్ద సుందరీకరణ చేపట్టాలి. జగనన్న కాలనీల్లో కూడా నీటి సంరక్షణపై దృష్టి పెట్టాలి. ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్, ఎస్టీపీల నిర్వహణ, పారిశుద్ధ్యం కోసం తెస్తున్న అత్యాధునిక యంత్రాలను సద్వినియోగం చేయాలన్నారు.

## రాష్ట్ర గవర్నర్ కి విమానాశ్రయంలో ఘన స్వాగతం





విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కు విశాఖపట్నం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం ఏ.ఎం.సిలో జరగనున్న శతాబ్ది వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ శుక్రవారం సాయంత్రం విశాఖపట్నంకు చేరుకున్నారు. జిల్లాకు విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో జిల్లా ఇన్ చార్జి మంత్రి విడదల రజని, నగర మేయరు గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ జి.సుబద్ర, జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున, పోలీస్ కమీషనర్ ఎ.రవిశంకర్, రెవిన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, తదితరులు గవర్నర్ కు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.





## నన్ను అంతమొందించేందుకు కుట్ర

### : ఏసీబీ కోర్టు జడ్జికి చంద్రబాబు లేఖ



విజయవాడ: ఏసీబీ కోర్టు జడ్జికి తెదేపా అధినేత చంద్రబాబు లేఖ పంపారు. తన భద్రత, ఆరోగ్యంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆయన 3 పేజీల లేఖ రాశారు. ఈ నెల 25న రాసిన లేఖను జైలు అధికారుల ద్వారా జడ్జికి పంపారు. తనను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారని అందులో చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కుట్రపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీకి లేఖ కూడా వచ్చిందని.. దానిపై ఇప్పటి వరకు పోలీసు అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదన్నారు. "నేను జైలుకు వచ్చినప్పుడు

తరువాయి 2లో..

## అమర్నాథ్ కు మరోసారి మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హెూదా

### - భారత ఉపరాష్ట్రపతికి స్వాగతం పలకనున్న మంత్రి అమర్నాథ్



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ కు మరోసారి అరుదైన అవకాశాలు లభించింది. గతంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖ వచ్చిన పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హెూదాలో మంత్రి అమర్నాథ్ ఆమెకు స్వాగతం పలికారు. కాగా శనివారం విశాఖకు వస్తున్న భారత ఉపరాష్ట్రపతి సురేష్ ధన్ కర్ కు కూడా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హెూదాలో స్వాగతం పలకనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఉదయం భారత ఉపరాష్ట్రపతి ఢిల్లీ నుంచి బయలుదేరి ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అతనికి మంత్రి అమర్నాథ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా స్వాగతం పలకనున్నారు. అనంతరం ఉపరాష్ట్రపతితో కలిసి మంత్రి అమర్నాథ్ పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. అదే విధంగా విశాఖ నుంచి ఉపరాష్ట్రపతి తిరుగు ప్రయాణమైనప్పుడు కూడా మంత్రి అమర్నాథ్ వీడ్కోలు పలకనున్నారు.

## ముసాయిదా జాబితా విడుదల..

### ఏపీలో మొత్తం ఓటర్లు 4,02,21,450

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా విడుదల చేశారు. ఈ మేరకు ఓటర్ల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచారు. ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని జిల్లాల్లోని రాజకీయ పార్టీలకు ఇవ్వాల్సిందిగా జిల్లా అధికారులకు ఈసీ సూచించింది. ఈసీ వెల్లడించిన జాబితా ప్రకారం..

రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 4,02,21,450

మహిళా ఓటర్లు 2,03,85,851, పురుష ఓటర్లు 1,98,31,791, సర్వీసు ఓటర్లు 68,158.

ముసాయిదా జాబితాలోని అభ్యంతరాల స్వీకరణకు ఆఖరి తేదీ డిసెంబరు 9.

2024 జనవరి 5న ఓటర్ల తుదిజాబితా విడుదల.

18-19 సంవత్సరాల కొత్త ఓటర్ల సంఖ్య 2,88,155

తరువాయి 2లో..

## రెండో రోజు రెట్టింపైన ఉత్సాహంతో సాగిన సామాజిక సాధికర యాత్ర

- టీడీపీ ప్రభుత్వంలా ప్రజలను మేం మోసం చేయలేదు- మంత్రి బొత్స
- పేదలకు అండగా నిలచిన వైకాపా ప్రభుత్వం- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర
- మా ప్రభుత్వంలో చేసిన మంచిని ప్రజలకు వివరిస్తున్నాం- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- మీకు మంచి చేసినవారికే ఒటు వేయండి-మంత్రి ధర్మాన ప్రసాదరావు



*వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను రెండవ రోజు గజపతినగరంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, మేరుగు నాగార్జున, మాజీ మంత్రి పుష్పశ్రీవాణి, తదితరులు ప్రారంభించారు.*

వార్త 6లో...

## రాష్ట్రంలో వైకాపా అరాచక పాలన కొనసాగుతోంది

- టిడిపిని ధైర్యంగా ఎదుర్కొనలేకే పోలీసులను అడ్డుపెట్టుకొని దాడులు చేస్తున్నారు
- ఈ ప్రాంతానికి చెందిన బీసీలపై చిత్తూరులో వైకాపా గుండాలు దాడి చేశారు
- బీసీలపై దాడిని స్థానిక వైకాపా నాయకులు ఎందుకు ఖండించడం లేదు
- టిడిపి జనసేన కలవకుండా చేయాలని వైకాపా మంత్రులు, నాయకులు మన మధ్య చిచ్చు పెడుతున్నారు
- నరసన్నపేట విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



వార్త 3లో...



# భారీ అన్నసంతర్పణ



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : జీవీఎంసీ జోన్ 2 పరిధి 6 వ వార్డు మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయంలో అమ్మవారికి అర్చకులు పట్నాల మూర్తి శర్మ, హరి చరణ్ శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిధిలాపురి ఉడా కోలని వాస్తవ్యులు (జై భవాని కనస్ట్రక్షన్) శ్రీ జె.వి.వి శ్రీనివాసరావు, శ్రీమతి జమున దంపతుల ఆర్థిక సహాయంతో సుమారు నాలుగు వేల మంది భక్తులుతో బారి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి కుంకుమ పసుపు కొమ్ములు, గాజులతో పాటు క్రికెటర్ వై. వేణుగోపాల్ దంపతులు సమకూర్చిన ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో పిల్లా చంద్రశేఖర్, పిల్లా సూరిబాబు, యస్.యన్.మూర్తి, పి.వి.జి.అప్పారావు, నాగోతి తాతారావు, పిల్లా శ్రీనివాసరావు, దుక్క వరం, పిల్లా మోహన్ శివకృష్ణ, పిల్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, గూడేల రాజు, పిల్లా సన్యాసిరావు, పిల్లా శ్రీనివాసరావు, పీస రామారావు, జగుపిల్లి నాని, బోగవిల్లి నాని, పిల్లా సత్యన్నారాయణ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య రక్షణకే జగనన్న ఆరోగ్య సురక్ష

### ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : పేదల ఆరోగ్య రక్షణకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు అన్నారు . శుక్రవారం మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడక సచివాలయం - 2 పరిధిలో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అందులో నిర్వహించే వైద్య పరీక్షలు గురించి వైద్య ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ యు సుకుమార వర్మ (తేజ) , ఎంపీపీ కోన సంధ్య బుజ్జి , కో జడ్పిటిసి నర్మాల కుమార్ , మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు , సర్పంచ్ చేపల సుహాసిని వెంకటరమణ , మాజీ వైస్ ఎంపీపీ ఉమ్మిడి కాసులమ్మ అప్పారావు , కో ఎంపిటిసి చేపల శ్రీరాములు , మాజీ ఎంపీటీసీ మేరుగు నిర్మల చినరాజులు , ఉప సర్పంచ్ గంగిరి లక్ష్మి రవి , వైసిపి నాయకులు ఉమ్మిడి జగన్ , సచివాలయ కన్వీనర్ కొవిరి శ్రీను , వైసీపీ నాయకులు మేరుగు చిన్న , ఉమ్మడి గంగయ్య , గనగల్ల గాడ్ , ప్రజలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయండి

### నాయకులు కార్యకర్తలకు మండల టిడిపి అధ్యక్షులు చిన్నా పిలుపు



పరవాడ :రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు రేపు అనగా శనివారం 28వ తారీఖున సాయంత్రం మూడు గంటలకు పెందుర్తి నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశాన్ని సబ్బవరం మండలంలో గల జిఎస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడానికి మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణమూర్తి నిర్ణయించారు అని మండల టిడిపి అధ్యక్షులు చిన్నా పేర్కొన్నారు , ఈ సమావేశానికి విచ్చేసి పార్టీకి సంబంధించిన వివిధ అంశాలపై చర్చిలో పాల్గొని మీ విలువైన సూచనలు సలహాలు ఇవ్వాల్సిందిగా ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిని ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నాము అని అన్నారు . కావున పరవాడ మండలంలో గల మాజీ ఎంపీపీలు,మాజీ జడ్పీటీసీలు,మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు విధిగా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగాచిన్నా కోరారు.

## పూడిమడకలో డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు



అచ్యుతాపురం (విజయబాను న్యూస్) : మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడక గ్రామంలో ప్రభుత్వంచే సుమారు 60 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే యు.వి రమణమూర్తి రాజు (కన్నబాబు) , మాజీ డిసిసిబి చైర్మన్ యు సుకుమార్ వర్మ (తేజ) శుక్రవారం పరిశీలించారు . ఎమ్మెల్యే మాట్లాడుతూ పనిలో జాప్యం లేకుండా త్వరితగతిన డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని , కాంక్రీట్ పని పూర్తయిన తర్వాత వీలైనంత ఎక్కువసార్లు వాటరింగ్ చేయాలని సూచించారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేపల సుహాసిని వెంకటరమణ , కో ఎంపిటీసీ చేపల శ్రీరాములు , మాజీ వైస్ ఎంపీపీ ఉమ్మిడి కాసులమ్మ అప్పారావు , మాజీ ఎంపిటీసీ మేరుగు నిర్మల చినరాజులు , వైస్ సర్పంచ్ గంగిరి రవి లక్ష్మి , వైసిపి నాయకులు ఉమ్మిడి జగన్ , సచివాలయ కన్వినర్ కొవిరి శ్రీను , వైసిపి నాయకులు ఉమ్మిడి గంగయ్య , మేరుగు చిన్న , గనగళ్ల ధనరాజు , గనగళ్ల గాడ్ , ఉమ్మిడి సత్తిబాబు , నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## ఇందిరాగాంధీ వర్ధంతి, భీమిలిలో వ్యాసరచన , వకృత్వ,చిత్ర లేఖనం పోటీలు

భీమునిపట్నం : విజయభాను న్యూస్ ఇందిరాగాంధీ వర్ధంతి, డాక్టర్ వల్లభాయ్ పటేల్ జయంతి ని పురస్కరించుకుని ఉమ్మడి విశాఖజిల్లా స్ధాయి లో వ్యాసరచన,వకృత్వ ,చిత్ర లేఖనం పోటీలు స్ధానిక గంటా శ్రీనివాసరావు అధికార నివాస భవనం లోఈనెల 29 న నిర్వహించనున్నట్లు ఆదర్శ హిందీ ప్రేమీమండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 11 వరకు వ్యాసరచన,11.30 నుంచి 12.30 వరకు చిత్ర లేఖనం,మధ్యాహ్నం 2 గంటలకు వకృత్వ పోటీలు ఒకొక్క విద్యార్థికి 5 నిమిషాలు వ్యవధి లో జాతీయ సమైక్యత అనే అంశంపై ఉంటుందని చెప్పారు. వ్యాసరచన ఇందిరాగాంధీ పై కానీ,సర్ధార్ వల్లభాయ్ పటేల్ పై కానీ హిందీ లేదా తెలుగు మాధ్యమంలో రాయవచ్చనీ తెలిపారు. బహుమతులు ఈనెల 31 న ముఖ్య అతిధుల చేతుల మీదుగా ఇవ్వబడుననీ చెప్పారు. మరిన్ని వివరాలకు 8985647419 ను సంప్రదించాలనీ ఆయన కోరారు.

## నన్ను అంతమొందించేందుకు కుట్ర

అనధికారికంగా వీడియోలు, ఫొటోలు తీశారు. ఆ ఫుటేజీని పోలీసులే లీక్ చేశారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తరహా వీడియో ఫుటేజీని రిలీజ్ చేశారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. భద్రతపై నా భయాలను గాలికొదిలేశారు. నా ప్రాణాలకు హాని ఉందని ఎస్పీకి అజ్ఞాత లేఖ వచ్చింది. వామపక్ష తీవ్రవాదులు నా హత్యకు ప్లాన్ చేస్తున్నట్లు లేఖలో ఉంది. నన్ను చంపేందుకు రూ.కోట్లు చేతులు మారినట్లు తెలిసింది. అజ్ఞాత లేఖపై పోలీసులు ఎలాంటి విచారణ చేయలేదు. అనుకోని ఘటన నివారణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

పెన్ కెమెరాతో డ్రగ్స్ కేసు నిందితుడు..

జైల్లో డ్రగ్స్ కేసు నిందితుడు పెన్ కెమెరాతో తిరుగుతున్నాడు. ఆ ఖైదీ జైలు లోపల ఫొటోలు తీస్తున్నాడు. ఈనెల 6న జైలు ప్రధాన ద్వారం మీదుగా డ్రోన్ ఎగురవేశారు. నా కదలికలు తెలుసుకునేందుకు డ్రోన్ వాడారు. ములాఖత్‌లో నన్ను కలిశాక వారి చిత్రాల కోసం డ్రోన్ ఎగురవేశారు. నాతోపాటు నా కుటుంబసభ్యులకు కూడా ప్రమాదం పొంచి ఉంది. జైలుపై డ్రోన్ ఎగురవేసింది వైకాపా వారేనని అనుమానం. ఈ విషయంపై పోలీసులు చర్యలు తీసుకోలేదు. డ్రోన్ ఘటన ప్రధాన సూత్రధారి ఎవరో గుర్తించలేదు. ఇది జైలు అధికారుల నిస్సహాయతకు నిదర్శనం. కొందరు గంజాయి ప్యాకెట్లు జైల్లోకి విసిరారు. గార్డెనింగ్ విధుల్లోని ఖైదీలు వాటిని పట్టుకున్నారు. రాజమహేంద్రవరం జైల్లో మొత్తం 2,200 మంది ఖైదీలు ఉన్నారు. వారిలో 750 మంది డ్రగ్స్ కేసు నిందితులు. కొంతమంది ఖైదీల వల్ల నా భద్రతకు తీవ్ర ముప్పు పొంచి ఉంది. జడ్ ప్లస్ కేటగిరీ రక్షణలో ఉన్న నా భద్రతకు ఇది తీవ్రమైన ముప్పు." అని లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు.

## ముసాయిదా జాబితా విడుదల..

2023 జనవరి 5 తేదీ తర్వాత ఓటర్లుగా నమోదైన వారి సంఖ్య 15,84,789

ముసాయిదా జాబితా ప్రకటించే నాటికి తొలగించిన ఓట్ల సంఖ్య 13,48,203

ఇందులో మృతి చెందిన ఓటర్ల సంఖ్య 7,10,000

ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఓటర్లు 5,78,625

పునరావృతమైన ఓటర్ల సంఖ్య 81,185

రాష్ట్రంలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 46,165

అనంతపురం జిల్లాలో అత్యధికంగా 19,79,775 మంది ఓటర్లు

అత్యల్పంగా అల్లూరి జిల్లాలో 7,40,857 మంది ఓటర్లు

2022 జనవరి 6 నుంచి 2023 ఆగస్టు 30వరకు అన్ని స్థాయిల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించిన ఈసీ

21,18,940 ఓట్ల తొలగింపు ప్రక్రియను పునః పరిశీలన చేసినట్టు వెల్లడి. ఆగస్టులో చేపట్టిన ఇంటింటి సర్వేలో జీరో డోర్ నెంబర్లతో 2,51,767 ఓట్లు గుర్తించినట్టు స్పష్టం చేసిన ఈసీ

1,57,939 ఇళ్లలో 10 మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు నమోదైనట్టు గుర్తింపు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి జీరో డోర్ నెంబర్లలో నమోదైన ఓటర్లను 66,740కి కుదించామన్న ఈసీ.

10 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న ఇళ్లను కూడా తనిఖీ చేసి, దానిని 71,581కి తగ్గించినట్టు వెల్లడి.

2023 సెప్టెంబరు 18 తేదీ నుంచి ఓటర్ల జాబితా ప్రక్రియను ఫ్రీజింగ్‌లో పెట్టడం వల్ల తనిఖీ ప్రక్రియ ముందుకు సాగలేదన్న ఈసీ.

# మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి 20 సం, జైలు శిక్ష

- 5000 జరిమానాతోపాటు బాధితురాలికి లక్ష రూ, నష్టపరిహారం
- బాధితులకు నాయ్యం జరిగేలా దిశ చట్టం స్పీడ్ ట్రయల్ కి ఉపయోగ పడింది స్పెషల్ పీ.పీ కరణం కృష్ణ
- కన్విక్షన్ పడుటలో ప్రతిభ కనబరిచిన అధికారులకు నగర సిపి రవిశంకర్ అభినందనలు




విశాఖపట్నం క్రైమ్ (విజయభాను న్యూస్): తొమ్మిది సంవత్సరాల బాలిక పై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పు, నిందితుడికి 20 సంవత్సరల జైల్ శిక్ష, రూ, 5,000 జరిమానా మరియు బాధితురాలికి రూ, 1,00,000 నష్ట పరిహారం విధించిన న్యాయస్థానం. బాధితులకు నాయ్యం జరిగే లాగా దిశ చట్టం స్పీడ్ ట్రయల్ కి ఉపయోగ పడిందని స్పెషల్ పోక్సో పీ.పీ కరణం కృష్ణ తెలియజేశారు. శుక్రవారం విశాఖపట్నం గౌరవ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఆనంది ద్వారక పోలీసు స్టేషన్ క్రైమ్ నెంబర్ 97/2018 వైడ్ ఎస్.సీ నెంబర్ 181/2019 యూ/ఎస్ 341, 354, 377 ఐపీసీ, సెక్షన్ 4 అఫ్ పోక్సో యాక్ట్ 2012 నందు విచారణ ముగిసిన తర్వాత ముద్దాయి షేక్ ఫరీద్ (తండ్రి. ఇమామ్ వయస్సు 24 సం,) కు 20 సంవత్సరల జైల్ శిక్ష, రూ, 5,000 జరిమానా మరియు బాధితు రాలికి రూ,1,00,000 నష్ట పరిహారం చెల్లించాలని తీర్పు ఇవ్వడం జరిగింది. సీతంపేట లో నివాసం ఉంటున్న బాలిక తండ్రి ఫిర్యాదు ప్రకారం తమ కుమార్తె కూల్ డ్రింక్ కోసం తమ ఇంటికి సమీపంలో ఉన్న కిరాణా దుకాణం వద్దకు వెళ్ళి, ఏడుస్తూ ఇంటికి తిరిగి వచ్చింది, బాలిక తండ్రి ఏమి జరిగింది అని అడగడంతో, కిరాణా దుకాణం నడుపుతున్న షేక్ ఫరీద్ అనే వ్యక్తి తన కళ్ళకు గంతలు కట్టి తనతో అసభ్యంగా ప్రవర్తించడని ఆమె తెలిపింది. వెంటనే బాలిక తండ్రి నిందితుడి వద్దకు వెళ్ళి అతడిని ప్రశ్నించగా సరదా కోసమే చేశానని బదులిచ్చి బాలిక తండ్రిపై దాడి చేయడంతో డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన ద్వారక పోలీసులు నిందితుడు అయిన షేక్ ఫరీద్ ను అదుపులోకి తీసుకుని విచారించగా అనంతరం నేరం రుజువు కావడంతో గౌరవ కోర్టు వారు పై సంచలన తీర్పు విధించడం జరిగినది. పై కేసు నందు కన్విక్షన్ పడుటలో ప్రతిభ కనబరిచిన స్పెషల్ పోక్సో పీ.పీ కరణం కృష్ణ ని, కేసు ట్రయిల్ జరగడంలో పురోగతి చూపించిన కేసు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అయిన అప్పటి ద్వారక సబ్ డివిజన్ ఎ.సి.పి పి. రామ చంద్రరావుని, ఇతర అధికారులు మరియు సిబ్బందిని నగర పోలీసు కమిషనర్ డా.ఏ. రవి శంకర్ (ఐ.పి.ఎస్) అభినందించడం జరిగింది, కోర్టు ట్రైల్స్ నందు విశేష సేవలు అందించినందుకు గాను అభినంధించి, రాష్ట్ర డి.జి.పి అదేశాలను అనుసరించి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న ప్రయారిటీ కేసుల నందు కోర్టులో ట్రయిల్ కు వచ్చి కన్విక్షన్ పడేంత వరకూ ఉన్నతాధికారులు ప్రతీ కేసును కన్విక్షన్ పడే వరకూ పూర్తి మోనటరింగ్ చేయాలని, ప్రతీ ఉన్నతాధికారి 5 కేసులు మోనటరింగ్ చేసే విధముగా అదేశాలు ఇచ్చామని, కేసుల విషయంలో క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్స్పెక్టర్ల తో మాట్లాడుతూ ఉండాలని, ఎక్కువ కేసులు గల రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ పై నిరంతరం దృష్టి పెట్టాలని తెలిపారు, ప్రతీ నెలా కన్విక్షన్ పడుతున్న కేసుల సంఖ్య మునుపటి నెలతో పోల్చినప్పుడు పెరుగుదల కనిపించాలని తెలిపారు .

# ఆశీలు మెట్ట అండర్ పాస్ సుందరీకరణ పనులకు మేయర్ శంకుస్థాపన



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** విశాఖ నగర సుందరీకరణలో భాగంగా విశాఖను ఆకర్షనీయ నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె సుమారు రూ. 147.33 లక్షల వ్యయంతో ఆశీల్ మెట్ట అండర్ పాస్ సుందరీ కరణ పనులకు దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాల మేరకు విశాఖ నగరం మరింత ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని, అందులో భాగంగా ఆశీల్ మెట్ట అండర్ పాస్ సుందరీకరణ పనులకు సుమారు రూ. 1.48 కోట్ల అంచనా వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం, ఆకర్షణీయ పెయింటింగులు, స్పీడ్ బ్రేకర్లు, స్ప్రింగ్ పోల్స్, ఆధునికి లైటింగ్ మొదలైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగినదిన్నారు. అలాగే ఇప్పటికే విశాఖ నగరంలో ఆకర్షణీయమైన బస్ బే లు, కూడళ్ళ అభివృద్ధి, రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు సమదృష్టితో ఈ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆమె కొనియాడారు.

అనంతరం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గం పరిధిలో సంక్షేమముతో పాటు, అభివృద్ధి పనులు ఎన్నో చేపట్టామని, దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో జగనన్న ప్రభుత్వం సఫలీకృతం అయిందని తెలిపారు. పూర్ణ మార్కెట్ రోడ్డు విస్తరణ, బస్టాప్ ల ఆధునికరణ, పార్కుల అభివృద్ధి, ప్రజలకు తాగునీరు మొదలైన మౌలిక వసతులు కల్పించడంలో వైయస్సార్ ప్రభుత్వం ముందుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్ బిపెన్ జైన్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, కార్యనిర్వాహక ఇంజనీరు సంతోషి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వైకాపా అరాచక పాలన కొనసాగుతోంది

- టిడిపిని ధైర్యంగా ఎదుర్కొనలేకే పోలీసులను అడ్డుపెట్టుకొని దాడులు చేస్తున్నారు
- ఈ ప్రాంతానికి చెందిన బీసీలపై చిత్తూరులో వైకాపా గుండాలు దాడి చేశారు
- బీసీలపై దాడిని స్థానిక వైకాపా నాయకులు ఎందుకు ఖండించడం లేదు
- టిడిపి జనసేన కలవకుండా చేయాలని వైకాపా మంత్రులు, నాయకులు మన మధ్య చిచ్చు పెడుతున్నారు
- పేట విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట(విజయభాను న్యూస్): ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన కొనసాగుతుందని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు

శుక్రవారం పేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక పోలాకి రోడ్డులో గల ఎస్.ఎల్.వీ.డీ ఫంక్షన్ హాల్ నందు నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ నాయకులుతో కలిసి బాబు షూరిటీ – భవిష్యత్ గ్యారెంటీ పై చర్చ వేదిక నిర్వహిచడం జరిగింది. ముందుగా పార్టీ తెలుగుదేశం పార్టీ వ్యవస్థపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ కేంద్ర మంత్రి, స్వర్గీయ కింజరాపు యర్రంనాయుడు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన కొనసాగుతుందని, ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన బీసీ కులస్తులు చంద్రబాబు క్షేమాన్ని కోరుతూ సైకిల్ యాత్ర చేపట్టి చిత్తూరు జిల్లాకి చేరుకునేసరికి ఆ జిల్లాకు చెందిన వైకాపా నాయకులు యొక్క అనుచరులు వారిపై ఎలా దాడి చేశారో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తులపై దాడి జరిగితే ఇక్కడి వైకాపా నాయకులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నరసన్నపేట ప్రాంతానికి చెందిన వైకాపా యువ నాయకుడు ఛాలెంజ్ లు చేయటం మానుకొని ఈ ప్రాంత వాసులపై జరిగిన దాడిని





ఖండించాలన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలు అభిమానులు రానున్న ఐదు నెలల పాటు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కోరుతూ జనసేన తెలుగుదేశం పార్టీలు ఒకే తాటిపై నడుస్తుంటే ఓర్వలేని కొంతమంది వైకాపా మంత్రులు నాయకులు అవాకులు చవాకులు మాట్లాడుతూ మన మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు జనసైనికులు అర్థం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ప్రసంగించారు. అనంతరం బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలో బూత్ ఏజెంట్స్, కన్వీనర్లు రానున్న ఎన్నికల దృశ్య తీసూకోవలసిన అంశాలను వివరిస్తూ అలాగే తెలుగుదేశం పార్టీ ప్రజలకు రానున్న రోజుల్లో అధికారం చెప్పట్టిన తరువాత ఇస్తున్న పథకాలను ప్రజలకు ఎలా వివరించాలి అనేది వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చీరంజీవి రావు, మాజీ శాసన సభ్యులు బగ్గు లక్ష్మణ్ రావు, టిడిపి యువజన విభాగం అధ్యక్షులు మెండ దాసునాయుడు , నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మహంతి చిన్నం నాయుడు, మరియు నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ పరికరాలు కొత్తవి ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు

భీమునిపట్నం : విజయభాను న్యూస్ భీమిలి బీచ్ వద్ద ఓపెన్ జిమ్ వద్ద జిమ్ పరికరాలు కొత్తవి ఏర్పాటు చేసినందుకు భీమునిపట్నం శాసనసభ్యులు అవంతి శ్రీనివాసరావుకు,క్లబ్ మెంబర్లకు, జోనల్ కమీషనర్ కు 3 వ వార్డు వైకాపా ఇంఛార్జ్ మైలపిల్లి షణ్ముఖరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరికరాలు పాడైపోయాయనీ, వాటి స్థానములో క్రొత్తవి పెట్టవలసినది గా గతంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు సభ్యులు, భీమిలి టెన్నిస్ క్లబ్మెంబర్స్, ఫాబ్ సభ్యులు, సాగర్ వాకర్స్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు 3 వ వార్డు వైస్సార్సీపీ ఇంచార్జి మైలపల్లి షణ్ముఖరావు, కోటమల్లికార్జునరావు, తదితరులు జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాము ను కోరగా ఆయన సిబ్బంది తో వచ్చి పరిశీలించి, నెల రోజులలో కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారనీ అన్నారు. చెప్పిన మాట ప్రకారం జిమ్ పరికరాలు బాగు చేయించారనీ, అందువలన ధన్యవాదాలు తెలిపారు .

## బరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రం లో పంచకర్ల సందీప్ పుట్టినరోజు వేడుకలు




భీమునిపట్నం : విజయభాను న్యూస్ : జనసేన పార్టీ భీమిలి ఇంచార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ పుట్టిన రోజు సందర్భంగా భీమిలీ మండలం, తాళ్ళవలస లో ఉన్న బరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రం లో ఉన్న బాలల మధ్య కేక్ కట్ చేసి బాలలకు పంచిపెట్టారు. అదే విధంగా తగరపువలస ఎంఎఫ్ సి ఫుడ్ బ్యాంక్ వద్ద కొంత మంది నిరుపేదలకు భోజనం పెట్టడం జరిగిందనీ జనసేన పార్టీ నాయకులు నీలాపు శంకరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంచార్జి పంచకర్ల సందీప్ పుట్టినరోజు వేడుకలు అనాధ పిల్లలు మధ్య జరుపుతూ వారి మధ్య లో కేక్ కట్ చేసి వారికి ఇవ్వడం వలన బాలలు చాలా సంతోషం వ్యక్తం చేసారనీ చెప్పారు. , జనసేన పార్టీ నాయకులు నాతో పాటు ,పాపా రావు , రాజగిరి సురేష్, ఇడ్డిపిల్లి నానాజీ ,ఏరాసు సూరి రెడ్డి ,చిల్లా రఘునాథ్ రెడ్డి ,రేసు రాజు ఆర్ధిక సహాయం తో ఈ వేడుకలు జరిపించినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో పగున రామ కృష్ణ పాల్గొన్నారు.

# పోలీస్ గ్రీవెన్స్ కు విశేష స్పందన

## సిబ్బంది నుండి నేరుగా వినతులు స్వీకరించిన సిపి రవిశంకర్



విశాఖపట్నం సిటీ(విజయభాను న్యూస్): నగర పోలీస్ కమిషనర్ డాక్టర్.ఏ.రవి శంకర్ (ఐ.పీ.ఎస్) తమ కార్యాలయం నందు శుక్రవారం నగర పోలీసు సిబ్బందికి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నగర లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ మరియు ఆర్మ్డ్ రిజర్వు సిబ్బంది శాఖా పరముగా ఉన్న తమ సమస్యలను నేరుగా సి.పి కి వినతులగా ఇచ్చేందుకు ప్రతీ నెలా మూడవ శుక్రవారం ఈ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.

సమస్యలు ఉన్న సిబ్బంది నిర్దేశించిన సమయంలో నగర కమిషనర్ కార్యాలయంనకు వచ్చి సి.పి కి తమ వినతులు తెలియజేయవచ్చు. ఈ గ్రీవెన్స్ లో పదమూడు మంది సిబ్బంది తమ వినతులను సి.పి కి నేరుగా తెలియపరిచారు.

ప్రమోషన్లకు సంబంధించిన, క్వార్టర్స్ కేటాయించామని, భద్రత నుంచి రావాల్సిన నగదు తక్కువ మొత్తంలో వచ్చినట్లు, జిల్లాల విభజన సమయంలో అనకాపల్లి కి వెళ్ళిన ఆరుగురు సిబ్బందిని తిరిగి నగర పరిధిలోకి తీసుకోవాలని వినతులు అందజేశారు, సి.పి వినతులను పరిశీలించి అవసరమైన వాటికి వెంటనే పరిష్కరించవలసినదిగా సంబంధిత సిబ్బందిని అదేశించారు.

# ఆడపిల్లల తల్లిదండ్రులు కనెక్ట్ అయ్యే సినిమా భగవంత్ కేసరి

## - దర్శకుడు అనిల్ రావిపూడి

విశాఖ పట్నం: భగవంత్ కేసరి సినిమా యూనిట్ శుక్రవారం విశాఖ లో సందడి చేసింది. షైన్ స్క్రీన్ బ్యానర్ పై నందమూరి బాలకృష్ణ హీరోగా కాజల్, శ్రీ లీల హీరోయిన్ల గా నటించిన భగవంత్ కేసరి లిమూవిలి లిషేర్ కా టూర్ లో భాగంగాలి విశాఖ సూర్యా బాగ్ లో గల మెలోడీ థియేటర్లో ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపేందుకు విశాఖ వచ్చారు. అనంతరం శ్రీ మెలోడీ థియేటర్లో మీడియా సమావేశం జరిగింది. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ, పెద్ద హిట్ చేసినందుకు ధన్యవాదములు చెప్పారు. ఇది తనకు ఏడో సినిమా అని తెలిపారు. తన రెగ్యులర్ జోనర్ దాటి బాలయ్య తో తీసిన ఈ సినిమా కి పెద్ద పేరు రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కథ విన్న వెంటనే ఇద్దరు అమ్మాయిలు తండ్రి అయిన బాల కృష్ణ ఓకే చేశారు అన్నారు. కొద్ది రోజుల లోనే సినిమా బ్రేక్ ఈవెన్ అవుతుంది. ఇది బాలయ్యకు 108 వ చిత్రం, ఇందులో బాలయ్య జీవించారు అని కొనియాడారు. ఇందులో యాక్షన్ సన్నివేశాలు బాగా వచ్చాయి, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తీసిన సన్నివేశాలు పోలీసులు ఉపాధ్యాయులు తదితరులు బాగా రిసీవ్ చేసుకున్నారు. వాళ్ళు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈ సబ్జెక్ట్ ఆడ పిల్లలు తల్లిదండ్రులకు బాగా కనెక్ట్ అయ్యింది అన్నారు. హీరోయిన్ శ్రీ లీల కు మంచి సూపర్ హిట్ పడింది



అన్నారు. తనకు విశాఖతో ఎంతో మంచి అనుబంధం వుంది, విశాఖలోనే అన్ని సినిమా కథలు రాసుకుంటాను అనీ గుర్తు చేశారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ, తాను పెళ్లి సందడి తరువాత విజయ యాత్రలు టూర్ లో భాగంగా విశాఖ వచ్చాము అన్నారు. ఇది కంటెంట్ ఓరియంట్ సినిమా అన్నారు. ఇంకా చాలా మంది ఈ సినిమా చూడాలి, కుటుంబ సమేతంగా చూసే సినిమా అన్నారు. వరుసగా మూడు సినిమాలు హిట్ కావడం చాలా ఆనందంగా ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నిర్మాత సాహు గరపాటి మాట్లా డుతూ, ఈ సినిమా మాట్లాడుతూ, ప్రేక్షకుల నమ్మకం నిలబెట్టుకుంది అన్నారు. నటుడు సత్య సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళలు కూడా పురుషులతో సమానం అన్నారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ధీర వనిత సునీత కృష్ణన్ ప్రజ్వల సంస్థ హైదరాబాద్ లో నిర్వహిస్తున్నారు. ఆమె సామూహిక లైంగిక దాడికి గురయిన కుంగి పోలేదు అన్నారు. శ్రీ లీల పాత్ర మహిళలకు స్ఫూర్తి దాయకం అన్నారు. తాను సినీ పరిశ్రమ లో స్థిర పడేందుకు సహకరించిన దర్శకుడు అనిల్ కు ధన్యవాదాలు తెలిపారు. నటుడు మురళీ మాట్లాడుతూ, ఈ సినిమాకు ప్రేక్షకులు అఖండ విజయం చేకూర్చారు ఇందులో మంచి పాత్ర చేశాను అన్నారు. తనకు కూడా ఇది ఏడో సినిమా అన్నారు. నటుడు జీవన్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో పోలీసు అధికారి పాత్ర ద్వారా మంచి గుర్తింపు వచ్చింది అని సంతోషం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో నిర్మాత హరీష్ పెద్ది, శ్రీ వేంకటేశ్వర ఫిలిమ్స్ ప్రతినిధి శ్రీనివాస్, మెలోడి థియేటర్ ప్రతినిధులు రమణ, గౌరీ శంకర్ , బాల కృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు కాళ్ల శంకర్, ఇతర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం చిత్ర యూనిట్ సభ్యులు మార్నింగ్ షో కి వచ్చిన ప్రేక్షకులతో ముచ్చటించి సినిమా సూపర్ హిట్ చేసినందుకు ధన్యవాదములు చెప్పారు.

# క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

**- పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన విశాఖ వాసి - క్రీడాకారునికి ముస్లింల ఆత్మీయ సత్కారం**



మాధవధార(విజయభాను న్యూస్) : ఇటీవలే నేపాల్ లో జరిగిన అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించి విశాఖ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పాడు జీవీఎంసీ 53వ వార్డు పరిధి మర్రిపాలెం జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన రాయి గణేష్(27) రాయి గణేష్ ఈనెల 5, 6, 7, 8,9 తేదీల్లో నేపాల్ లోని పోఖరాలో జరిగిన ఎస్ బి కె ఎఫ్ 8వ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారు.

ఈ పోటీల్లో వివిధ దేశాలకి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నెల 7న జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గణేష్ పాల్గొని తన ప్రతిభ పాటవాలు చాటారు. ఈ నేపథ్యంలో ఈనెల 8న బంగారు పతకాన్ని గణేష్ కు అక్కడ నిర్వాహకులు అందజేశారు.

ఈమేరకు రాయి గణేష్ కు జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్ – ఈ – అల్ ఖదీర్ కమిటీ సభ్యులతో పాటుగా గ్రామస్థుల శుక్రవారం మస్జిద్ ప్రాంగణంలో అత్మీయ సత్కారం నిర్వహించి శాలువాతో సత్కరించారు. ఇంట్లోని ఆర్థిక పరిస్థితుల వలన కేవలం పదో తరగతి వరకు చదువుకున్న గణేష్ వెయిట్ లిఫ్టింగ్, వ్యాయామ పట్ల మొదటి నుంచి ఆసక్తి ప్రదర్శించేవాడని అటువంటి యువతకు ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కోలని వాసులు కోరుతున్నారు.

క్రీడా కారుడు గణేష్ మాట్లడుతూ ఎప్పటికైనా ఏసియన్ ఛాంపియన్షిప్, కామన్వెల్త్ ఆటల పోటీల్లో బంగారు పతకాలు సాధించడమే లక్ష్యం గ కృషి చేస్తున్నానని నెంబర్ వన్ వెయిట్ లిఫ్టర్ గా మెడల్స్ సాధించి ప్రపంచవ్యాప్తంగా విశాఖకు క్రీడల్లో కీర్తిని తీసుకురావడమే అంతిమ లక్ష్యమని అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి సరైన ప్రోత్సహం అందిస్తే మరింత ముందుకు వెళ్తానని గణేష్ అంటున్నారు. కార్యక్రమంలో మస్జీద్ కమిటీ అద్యక్షులు మున్న, కార్యదర్శి వలి, నూరి ,బాషా,మదార్ పెద్ద సంఖ్యలో కొలని వాసులు పాల్గొన్నారు.

# విదేశీ విద్యార్థులు భారతీయ సంస్కృతిని అర్థం చేసుకోవాలి

## గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుణశేఖరన్



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** వివిధ దేశాల నుంచి వచ్చి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఆంతర్జాతీయ విద్యార్థులు భారత దేశ సంస్కృతి సంప్రదాయాలను అర్థం చేసుకుని మంచిని గ్రహించి విద్యార్థులతో సాంస్కృతిక సంబంధాలను పెంచుకోవడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వంతో పట్టభద్రులుగా తమ దేశాలకు వెళ్ళాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పేర్కొన్నారు. నూతనంగా ప్రవేశం పొందిన విదేశీ విద్యార్థులకు శుక్రవారం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. అంకిత భావం, కష్టపడే గుణం ఉంటే ఉన్నత విద్యలో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని ఆయన సూచించారు. గీతంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సధుపాయాలు, అధ్యాపకుల మార్గదర్శకం విదేశీ విద్యార్థులు సకాలంలో కోర్సులు పూర్తి చేసి తిరిగి దేశాలకు వెళ్ళేలా వీలు కల్పిస్తున్నాయన్నారు. గీతం అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ వై.రాధిక మాట్లాడుతూ గీతంలో నిర్వహిస్తున్న కోర్సులు, సిలబస్ బోధన, హాజరు, ఈ–లెర్నింగ్ సధుపాయాలు విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను గీతంలో అమలు చేస్తున్నామని తెలిపారు. గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డైర్టర్ డాక్టర్ కె.పి.సి.కిషన్ మాట్లాడుతూ గీతంలో ప్రస్తుతం 25 దేశాలకు చెందిన 400 మందికి పైగా విదేశీ విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని, కొత్త విద్యా సంవత్సరంలో 120 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని వెల్లడించారు. విదేశీ విద్యార్థుల ద్వారా గీతం అంతర్జాతీయంగా గుర్తుంపు పొందుతోందని తెలిపారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ విద్యార్థులకు స్కాలర్ షిప్ రూపంలో ప్రోత్సహిస్తోందని తెలిపారు. గీతంలో ప్రవేశం పొందుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోందన్నారు. ఈ సందర్భంగా గీతం నుంచి పిహెచ్‌డి డిగ్రీ పూర్తి చేసిన విదేశీ పరిశోధక విద్యార్థి దన్‌లాడి సగిర్‌ను సన్మానించారు. గీతం లోని విదేశీ విద్యార్థుల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ వివిధ సంగీత, నృత్య కార్యక్రమాలు ప్రదర్శించారు.

# విజయభాను సంపాదకీయం

## రాజకీయంగా తీవ్ర అలజడి

'ఇండియా–భారత్' వివాదం మళ్లీ తెరమీదికొచ్చి రాజకీయంగా తీవ్ర అలజడికి కారణమైంది. ఈ మారు వివాదానికి కేంద్రమైంది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి). అన్ని పాఠ్య పుస్తకాల్లో 'ఇండియా' స్థానంలో 'భారత్'ను ఉపయోగించాలని సాంఘిక శాస్త్రాల విషయాలపై పరిశీలనకు ఎన్‌సిఇఆర్‌టి నియమించిన ఉన్నత కమిటీ సిఫారసు చేసింది. అంతేనా, చరిత్రలో హిందూ రాజుల విజయ గాధలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, ప్రాచీన, మధ్య, ఆధునిక చరిత్రలతో పాటు భారత సంప్రదాయ చరిత్రను విద్యార్థులకు బోధించాలంది. కమిటీ సిఫారసులపై ప్రతిపక్షాలు, విద్యావేత్తలు, మేధావుల నుంచి ముప్పేటా విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సకలానీ స్పందిస్తూ కమిటీ సిఫారసులు ప్రతిపాదనల దశలోనే ఉన్నాయని, తుది నిర్ణయం తీసుకోలేదని వివరణిచ్చారు. అంతటితోనే వివాదానికి ఫుల్‌స్టాప్ పడుతుందని భావించలేం. సైద్ధాంతికంగా, ఉద్దేశపూర్వకంగానే మోడీ ప్రభుత్వం పలు వ్యవస్థల్లో తమ హిందూత్వ ఎజెండా చొప్పింపును చూస్తూనే ఉన్నాం. వాటికి కొనసాగింపుగానే ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య ప్రణాళికల్లో మార్పులను అర్థం చేసుకోవాలి.

ఢిల్లీలో నిర్వహించిన జి20 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న దేశాధినేతలకు రాష్ట్రపతి విందు ఇవ్వగా, ఆ సందర్భంగా కేంద్రం ప్రచురించిన ఆహ్వాన పత్రికలలో తొలిసారి 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' స్థానంలో 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని పేర్కొనడంతో వివాదం చెలరేగింది. అనంతరం జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా పేరు భారత్‌గా మారుస్తారన్న చర్చ వచ్చింది. ఇప్పుడు తిరిగి ఎన్‌సిఇఆర్‌టి తేనెతుట్టెను కదిలించింది. దేశం పేరు మార్పు అనేది అదేదో విపక్షాల ఫోరం 'ఇండియా' అని పేరు పెట్టుకుంది కాబట్టి ఆ పదం ఉచ్ఛరించడం ఇష్టం లేక మోడీ ప్రభుత్వం అధాటుగా తీసుకున్న నిర్ణయం అనుకుంటే పొరపాటు. మన దేశానికి ఏ పేరు పెట్టాలనే అంశంపై హిందూత్వ వాదుల ప్రతిపాదనలు వేరేగా ఉన్నాయి. హిందూత్వ సిద్ధాంతకర్తగా ఆర్‌ఎస్‌ఎస్ పిలుచుకునే సావర్కర్, 1923లో రాసిన 'హిందుత్వ' గ్రంథంలో హిందూస్తాన్ సహా పలు పేర్లు సూచించాడు. ఆయనా విష్ణుపురాణంలో ఉన్న భారత ఖండం నామధేయాన్ని ప్రస్తావించాడు. ఎన్‌సిఇఆర్‌టి వేసిన కమిటీ కూడా మక్కీకి మక్కీ అదే ప్రస్తావన చేయడం గమనార్హం. కాబట్టి వాస్తవాలతో, పరిశోధనలతో, ఆధారాలతో కమిటీ సిఫారసు చేయలేదని గుర్తించాలి. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత అమలులో భాగంగానే కమిటీ సిఫారసులను చూడాలి.

పాఠ్య ప్రణాళికల ఫ్రేమ్‌వర్క్‌పై ఎన్‌సిఇఆర్‌టి 2021లో 25 ఉన్నత కమిటీలు వేయగా సాంఘిక శాస్త్రాల పరిశీలనపై సి.ఐ ఐజాక్ ఛైర్మన్‌గా వేసిన కమిటీ ఒకటి. ఐజాక్ చరిత్రకారునిగా కంటే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతవాదిగానే ప్రాచుర్యం పొందారు. భారత చరిత్ర పరిశోధన మండలిలో సభ్యుడు కూడా. 1975లో ఎబివిపిలో పని చేశారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలు కలిగిన భారతీయ విచార కేంద్రం కేరళ విభాగానికి వర్కింగ్ ప్రెసిడెంట్. ఐజాక్ కమిటీలోని మరో సభ్యుడు వందనా మిశ్రా సైతం ఎబివిపి కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా పని చేశారు. ఇటువంటి వారున్న కమిటీలు ఎటువంటి సిఫారసులు చేస్తాయో అర్థం చేసుకోవచ్చు. పౌరసత్వ చట్టం, ఏకరూప పౌర స్మృతి, అగ్నివీర్, చరిత్ర వక్రీకరణ, సైన్స్‌లో డార్విన్ పరిణామ సిద్ధాంతం ఎత్తివేత... అనేకానేక వివాదాలు ఆర్‌ఎస్‌ఎస్ అమ్ముల పొదిలో ఉన్నాయి. విద్యకు కాషాయం కప్పే నానారకాల అంశాలు మోడీ సర్కారు ప్రతిపాదించిన నూతన జాతీయ విద్యావిధానంలో నిక్షిప్తమయ్యాయి. కోట్లాది పిల్లల మెదళ్లల్లో భావ కాలుష్యాన్ని అవి నింపుతున్నాయి. కేరళ వామపక్ష ప్రభుత్వం, మరికొన్ని విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే రాజ్యాంగపరంగా రాష్ట్రాలకు విద్యపై ఉన్న హక్కును రక్షిస్తూ కేంద్ర విధానాలను ప్రతిఘటిస్తున్నాయి. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, నిజమైన చరిత్ర బోధించాలి. శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి. విద్యలో బిజెపి సంకుచిత రాజకీయాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన తరుణం.

# మత్తు ఔషధాలను పిల్లలకు విక్రయిస్తే కఠిన చర్యలు

## - ఎస్సిపిసిఆర్ సభ్యులు గొండు సీతారాం




శ్రీకాకుళం (విజయభాను న్యూస్):వైద్యుల సిఫారసులు లేకుండా పిల్లలకు ఎటువంటి మత్తు ఔషధాలను విక్రయించినా అటువంటి ఔషద దుఖానాలుపైన, వ్యక్తులపైన కఠిన చర్యలకు రాష్ట్ర,జిల్లా అధికారులకు సిఫారసులు చేయనున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్సిపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం అన్నారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు మేరకు శుక్రవారం డగ్లస్ స్కూల్ దగ్గర్లో గల జిల్లా ఔషద నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వారి కార్యాలయంలో జిల్లాలోని బాలలకు మత్తు ఔషధాల విక్రయ నియంత్రణలో అధికారులు, ఔషద దుకాణాలు యజమానుల పాత్రపై దుఖానదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం మాట్లాడుతూ పెద్దలు తోడు లేకుండా, పిల్లలు నేరుగా వైద్యుల సిఫారసు చీటీలు లేకుండా మందుల దుకాణాలకు కొస్తే కోరెక్స్ వంటి దగ్గుమందులు ఆల్ప్రోజోలం 0.25,0.5ఎం.జి, బెంజోడియ,జెపినిస్, డయాజెపం, నైట్రాజెపం, ఆల్ప్రెక్స్ 0.25,రెస్టిల్ 0.5వంటి మందులే కాకుండా ఒపియోయిడ్స్, మోర్ఫైన్,కోడైన్,ఫెంటాలైనేటిక్ వంటి మత్తు ఇంజెక్షన్లు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు. అంతే కాకుండా నూటికి నూరు శాతం బాలల మానసిక ఆరోగ్యాలతో ఆట్లాడ డమే అవుతుందని అన్నారు, ఇటువంటి అమ్మకాలు జరిపే ఔషద దుఖానాలుపై ప్రత్యేక దృష్టి నిలపడంతో పాటు ప్రత్యేక నిఘాను తీవ్రతరం చేయాలని అన్ని జిల్లాల పోలీసు ఎస్పీలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని అన్నారు,అలాగే పిల్లలకు ఇటువంటి మందులు విక్రయాలు జరపబోమని ఆయా షాపులు యజమానులు స్పష్టంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు ఉల్లంఘించి బాలలకు మత్తు ఔషధాలు అమ్మకాలు జరుపుతున్నట్టు పౌర సమాజం దృష్టికోస్తే apscpcr2018@gmail.com కు ఫిర్యాదులు చేస్తే తక్షణమే స్పందించి చట్ట ప్రకార చర్యలతో పాటు క్రిమినల్ చర్యలుకు సిఫారసులు చేస్తామని అన్నారు. జిల్లా ఔషద నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరావు మాట్లాడుతు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం సూచించిన ప్రతీ అంశాన్ని జిల్లాలోని అన్ని మెడికల్ షాపులు యజమానులు దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా బాలలకు మత్తు ఔషధాలు అమ్మకాలు జరపబోమని ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయిస్తామని అన్నారు,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు,సూచనలు శత శాతం పాటించి ఆరోగ్యవంతమైన బాలల శ్రీకాకుళం జిల్లాగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తామని అన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ మత్తు ఔషధాలు వాడడం వల్ల పిల్లల జీవితాలు ఏ విధంగా చిద్రం కాబోతాయో ఎలిమెంటరీ విద్య నుండే పిల్లల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అన్ని శాఖల ఉన్నతాది,కారులతో మరిన్ని అవగాహన కార్యక్రమాలు పూర్తి చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎన్.యుగంధర్ రావు,శ్రీకాకుళం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు గన్నెప్పడు,జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కరుణ కుమార్ గుప్త,గౌరవ ప్రధాన కార్యదర్శి వి.మణి రాజు, ట్రెజరర్ కే.మురళి కృష్ణ,నగరానికి చెందిన ఔషద దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా గ్రీవెన్స్ నిర్వహించిన కె.కె రాజు



సీతమ్మధార (విజయభాను న్యూస్) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు శుక్రవారం విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి పలువురు కార్యాలయంకు విచ్చేసి తమ సమస్యలను కె కె రాజు కి స్వయంగా వచ్చి విన్నవించారు. వారి వద్ద నుండి సంబంధిత వినతి పత్రాలు, దరఖాస్తులు తీసుకుని అధికారులతో మాట్లాడి కొన్ని వెంటనేపరిష్కరించారు.మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# సమయం కవి

## 'సర్కార్ – సోగ్గాలు'

ఓరే నాయినా।
ఎక్కడ్రా మీకు చాలలేదు
దాహం-దాహం అని చస్తున్నారు.
ఎక్కడ్రా మీకు చాలలేదు
ఆకలి-ఆకలి అని చస్తున్నారు.
సర్కార్ కొలవున్నోల్లారా।
ఎక్కడ చూసినా! మీరేరా।
సమ్మెలు - నిరాహారదీక్షలు
జీతభత్యాలు చాలవని..। ...ఓరే
మీ బ్రతుకు మాడా।
మీ పొరుగు- ఇరుగోడు
ఎదుటోడు- ప్రక్కోడు
ఎలా బ్రతుకుచున్నారో। .. చూస్తున్నారురా।
అది చాలక - దొడ్డి దారిలో
మీ సంపాదనలు - చేయి చాపడాలు
మీ వెనుక ఎంత తిట్టి పోస్తున్నారో।
ఆలోసించారురా।
అటు చూడండిరా।
కొండ మీద రాళ్లు కొట్టినోళ్లను
ఒక పూట తింటే -ఒక పూట పస్తునోళ్లను
అటు చూడండిరా।
బహు అంతస్తులు నిర్మించే కూలీల,
ఆర్తనాధాలను ...॥ఓరే॥
అటు చూడండిరా।
క్షణం... క్షణం గండంలా గడ్పె
ఆటో కార్మికుల ఆవేదనలను
అటు చూడండిరా।
ప్రైవేట్ సంస్థలలో సగం ఆకలిలో
చస్తున్నోలను
సర్కార్ మడం త్రిప్పిన రోజువస్తే;
దిన కూలీల రేట్లు అధిక మొత్తం పెంచిన రోజువస్తే;
సర్కార్ కొలువులకు ఎగబాకర
కూలి పనులకు పోయినట్లు చేసే రోజువస్తే;
జీతభత్యాలు చాలవని... సర్కార్ కోలవోళ్లు
సమ్మెలు నిరాహారదీక్షలుండబోవు ఏరోజు
...॥ఓరే॥

... రచన : ఎల్ సిద్ధు
సెల్ నెం: 7702977293

# పంచాంగం

| పూర్ణిమ రా. 1.48<br>రేవతి ఉ. 8.02, వ.తె. 3.09ల 4.41 | శనివారం<br>28-10-2023 |
|---|---|

a మేషం : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరగలదు. స్త్రీలు భేషజాలకు, మొహమాటాలకు పోవటం మంచిది కాదు.

b వృషభం : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. స్త్రీల ఆలోచనలు పొదుపు దిశగా కొనసాగుతాయి. దైవదీక్షలు, సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల తీరును గమనించి మెలగాల్సి ఉంటుంది.

c మిథునం : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు.

d కర్కాటకం : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, అప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అనుకూలిస్తాయి.

e సింహం : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి.

f కన్య : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g తుల : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h వృశ్చికం : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i ధనుస్సు : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..


j మకరం :ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.

.k కుంభం : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. స్త్రీలకు పనివారలతో సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి.

L మీనం : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# అరిష్టాలను హరించే అయినవిల్లి గణపతి

## సంకీర్తన




సంపదలకు మహాలక్ష్మిదేవిని, మోక్షానికి పరమశివుడిని, సకల సౌభాగ్యాలకు వైకుంఠవాసుడిని ఇలా ఒక్కో భాగ్యానికి ఒక్కో దేవతను పూజించేకన్నా సర్వసౌభాగ్యాలకు, సకలైశ్వర్యాలకు, సకల సంపదలకు ఆదిదేవుడైన విఘ్నేశ్వరుణ్ణి కొలిస్తేచాలు కోరిన కోరికలు ఇట్టే నెరవేరుతాయి. అలాంటి విఘ్ననాయకుడు సిద్ధి వినాయకుడిగా అయినవిల్లిలో - తూర్పు గోదావరి జిల్లాలో అమలవాపురం పట్టణానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో కోరి కొలువైయ్యాడు.ఈ విఘ్ననాశకుడు కొలువైన ఈ ఆలయం చారిత్రక, ఆధ్యాత్మిక వైభవాలతో పాటుగా పౌరాణిక ప్రశస్తిని కూడా కలిగి ఉంది. ఈ సిద్ధి వినాయ కుడు స్వయంభువు. ఈ ఆలయాన్ని దేవతలందరూ నిర్మించారని, వేదవ్యాస మహర్షి ఈ వినాయ కుడిని ప్రతిష్ఠించి నట్లు స్థల పురాణం ద్వారా తెలు స్తోంది. మహాభారత యుద్ధా నంతరం వేదవ్యాసుడు దక్షిణదేశ యాత్రలు చేస్తున్నప్పుడు అయిన విల్లి చేరుకున్నారట. అప్పుడిక్కడ సిద్ధి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేసినట్టు స్థలపురాణం చెప్తోంది. ఈ సిద్ధి వినాయకుణ్ణి దక్ష ప్రజాపతి పూజించినట్లుగా పురాణాలు వెల్లడిస్తున్నాయి. శివుని ఆగ్రహానికి గురైన దక్షప్రజాపతి యాగం వీరభద్రేశ్వరుని వల్ల ఆగిపోయిన తర్వాత

- దక్ష ప్రజాపతి ఇదంతా నేను ముందు విఘ్నేశ్వరుని పూజచేయక పోవడం వల్లే ఇన్ని ఆటంకాలు కలిగాయని విఘ్నేశ్వరుని ముందు పూజించి ఆ తర్వాత యజ్ఞ పరిసమాప్తి చేస్తానని ఈ సిద్ధి వినాయకుడిని పూజించారట. ఇక ఎలాంటి విఘ్నాలు లేకుండా శివునికి అనుగ్రహంతో యాగం పరిసమాప్తి చేసుకొన్నారని పురాణోక్తి. మరికొందరు ఈ వినాయకుడిని స్వయంభువుగా కూడా ఆరాధిస్తారు.

**కొబ్బరికాయతో సంతృప్తి:**

ఇన్ని ప్రశస్తులు కలిగిన ఈ వినాయకుడికి భక్తులు కోరిన కోర్కెలు ఈడేరటానికి కొబ్బరికాయను సమర్పిస్తారు. ఇలా కొబ్బరి కాయను కొట్టడం ద్వారా తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అయినవిల్లి సిద్ధి వినాయకుడిని ప్రమాణాల వినాయకుడు అనీ మరో ప్రశస్తి కూడా ఉంది. ఈ స్వామి వారి భక్తులు ఈ స్వామిమీద ప్రమాణ చేసి సాక్ష్యం చెప్తే వారికి తిరుగులేని విజయం లభిస్తుంది. ఒకవేళ అబద్ధపు సాక్ష్యం ఎవరైనా చెప్తే ఆదిదేవునికి కోపానికి గురికావాల్సిందేనంటారు అనుభవజ్ఞులు.

**శిల్పసంపద:**

చారిత్రకంగా పరిశీలించినప్పుడు ఈ అయినవిల్లి వినాయకుని ఆలయ ముఖమండపం 1953లో ప్రతిష్టించబడగా 1986లో గర్భాలయ విమాన శిఖరాన్ని పునర్నిర్మించారు. తూర్పు దక్షిణాన ఉన్న గాలిగోపురాలలో 1991లో ఈ ఆలయానికి దక్షిణ గోపురం నిర్మించబడింది. ఇది చాలా ఎత్తుగాను, అరుదైన శిల్పసంపదతో కూడి అత్యంత మనోహరంగా కనిపిస్తుంది.విశాలమైన ఆవరణతో ఎత్తయిన ప్రాకారాలతో శిల్ప కళాశోభితమైన ఈ ఆలయం భక్తులనేకాక పర్యాటకులను కూడా ఆకర్షిస్తోంది. ప్రధాన ద్వారాన్ని దాటుకుని లోనికి ప్రవేశించగానే సుమారు 45 అడుగుల ఎత్తున్న ధ్వజస్తంభం దర్శనమిస్తుంది. ప్రధాన ఆలయం ముఖమండపం అంతరాళం గర్భాలయాలను కలిగి ఉంది. గర్భాలయంలోని స్వామి మూడు అడుగుల ఎత్తుతో దివ్యమంగళునిగా దర్శనం ఇస్తారు.ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి, శ్రీ అన్నాపూర్ణాదేవి, శ్రీవిశ్వేశ్వరస్వామి శ్రీ కాలభైరవ స్వామి ఇలా వీరంతా ఈ ప్రాంగణంలోని ఉపాలయాల్లో కొలువుదీరి వినాయకునితోపాటుగా పూజలందుకుంటూన్నారు. అయినవిల్లి క్షేత్రపాలకుడుగా శ్రీకాలభైరవస్వామి పూజలందుకుంటున్నారు. ముఖమండపం పైన నృత్యగణపతి కొలువుదీరాడు.ఈ సిద్ధివినాయకునికి నిత్య పూజలతోపాటుగా విశేషారాధనలు జరుగుతుంటాయి. ప్రతిరోజు నారికేళ ఫలోదకజలములతో, సప్తనదీ జలాలతోను అభిషేకాలు జరుపుతారు. చవితి తిథులతో పాటుగా ఏకాదశి దశిమి తిథుల్లోను ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శ్రీ లక్ష్మీ గణపతిహోమం నిర్వహిస్తారు.

ప్రత్యేకంగా రుదక్ష పూజచేస్తారు. గణపతి నవరాత్రులు, భాద్రపద శుక్ల చవితినాడు వార్షికోత్సవాలు ఆరంభించి తొమ్మిదిరోజుల పాటు అంగరంగ వైభోగంగా ఈ స్వామివారికి మహోత్సవాలను నిర్వహిస్తారు.

# ప్రజలకు రక్ష.. ఆరోగ్య సురక్ష

## ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు



సాలూరు విజయ భాను న్యూస్ అక్టోబరు 27 : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్ష అని రాష్ట్ర ఎస్టీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు అన్నారు. సాలూరు మండలంలో శుక్రవారం పర్యటించి సారికి, ధూళిభద్ర తదితర కొటియా గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. స్వయంగా వైద్యుడు కావడంతో ఆయనలో ఉన్న వైద్య వృత్తిని చేపట్టి స్వయంగా పలువురు వ్యక్తులకు వైద్య పరీక్షలు సారిక పాఠశాలలో విద్యార్థులకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, అయితే స్వయంగా పర్యటించడం వలన మరికొన్ని సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ప్రభుత్వం దృష్టిలో పెడతామని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు మంచి స్పందన వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ విధమైన శిబిరాల నిర్వహణ మంచి విషయమని, ప్రజలకు అందుబాటులో స్పెషలిస్ట్ వైద్యుల చికిత్స లభిస్తుందని ఆయన అన్నారు. ఆరోగ్య సమస్యలు ప్రజలు తెలుసుకోగలరని ఆయన చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష వలన బిపి, మధుమేహం వంటి వ్యాధులు ఉన్నట్లు తెలుసుకుంటున్నారని తెలిపారు. జీవనశైలిలో మార్పులు కారణంగా బిపి, మధుమేహం వంటి సైలెంట్ కిల్లర్ లు వస్తున్నాయని, ఆరోగ్య జాగ్రత్తలు అవసర మన్నారు. ప్రభుత్వం వైద్యం, విద్యపై దృష్టి సారించడం సంతోషదాయకం, అలాగే నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని, ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుందని ఆయన తెలిపారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అందిపుచ్చు కోవాలని సూచించారు. వైద్యం, ఇంజినీరింగ్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందాల న్నారు. ఆరోగ్యం సహకరిస్తే దేనినైనా సాధించగలం, విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య పరీక్షలు చేయాలని ఆయన ఆదేశించారు. ఉపాధ్యాయులు ఉత్తమ శిక్షణకు నడుం బిగించాలని ఆయన కోరారు. విదేశీ విద్యను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణీలకు ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో సాలూరు మండల వైస్ చైర్మన్ రెడ్డి సురేష్, మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాస్, దండి శ్రీనివాసరావు,గొర్లె రాజారావు, గిరిజన నాయకుడు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె శ్రీనివాస రావు, డెప్యూటీ డిప్యూటీ డి ఎం & హెచ్ ఓ శివకుమార్, డాక్టర్లు వైద్య సిబ్బంది, ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి, ఐసిడిఎస్ రూరల్ పిఓ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు

## -అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళు

## - ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం



ఆమదాలవలస(పొందూరు) అక్టోబర్ 27 :గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పన ద్వారా అభివృద్ధికి నిజమైన సారధిగా నిలుస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శుక్రవారం గొకర్ణపల్లి పంచాయతీ పరిధిలో పనులు పూర్తి చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గోకర్ణపల్లి గ్రామంలో సుమారు 40 లక్షల నిధులతో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో గోకర్ణపల్లి గ్రామంలో సిసి రోడ్డు రంగనాథ పేట గ్రామంలో కలువాలతో కూడిన సిసి రోడ్డు మరియు సచివాలయం భవనానికి రక్షణ గోడ పనులు పూర్తి చేశారు ఆ కార్యక్రమాలను ఈ రోజు స్పీకర్ చేతులు మీదగా ప్రారంభించారు. సుమారు 65 లక్షల నిధులతో రంగనాథ్ పేట గ్రామంలో వాటర్ ట్యాంకు మరియు ఇంటింటికి మంచి నీటి కొళాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా సుమారు రెండు కోట్ల 65 లక్షల ఏఐఐబి నిధులతో కావలి ఆర్ అండ్ బి రోడ్డు నుండి వయా మున్సిబ్ పేట లచ్చయ్యపేట మీదగా తాడివలస వెళ్ళే నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును స్పీకర్ తమ్మినేని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్టు వివరించారు.ఎన్నికల మేనిఫెస్టోను సర్వమత గ్రంథాలుగా భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి పాలన పట్ల ప్రజల్లో విశ్వసనీయత చెక్కు చెదరలేదని పేర్కొన్నారు..గత మూడున్నర ఏళ్లలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ అత్యుత్తమ నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉష రాణి, జెడ్పీటీసీ లోళుగు కాంతారావు,మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, పి ఎ సి ఎస్ అధ్యక్షులు కోంచాడ రమన మూర్తి,మార్కెట్ కమిటీ అధ్యక్షులు బడాన సునీల్, పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు స్థానిక సర్పంచ్ చింతాడ మాధురి స్థానిక నాయకులు చింతాడ ప్రసాదరావు రాజశేఖర్ జీవరత్నం సీపాన రాజుల నాయుడు తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపిటిసిలు,నాయకులు, కార్యకర్తలు,అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ వై కే బృందాన్ని అభినందించిన కలెక్టర్



శ్రీకాకుళం, అక్టోబర్ 27: అజాది కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేరీ మట్టి మేరీ దేశ్ పేరుతో జిల్లాలో ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి సేకరించిన మట్టి, బియ్యాన్ని ఢిల్లీకి పంపిస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఢిల్లీకి వెళ్తున్న నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ల బృందాన్ని అభినందించి, విజయవాడ వరకు వారు వెళుతున్న బస్సును ఆయన జిల్లా పరిషత్ లో శుక్రవారం సాయంత్రం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా నుంచి నెహ్రూ యువ కేంద్రానికి చెందిన 27 మంది వాలంటీర్లు విజయవాడ వరకు బస్సులో, అక్కడినుంచి రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రైన్ లో ఢిల్లీకి వెళ్తారని అన్నారు. దేశం కోసం అసువులు బాసిన స్వాతంత్ర సమరయోధుల జ్ఞాపకార్థంగా ఢిల్లీలో ఉద్యానవన నిర్మాణానికి ఈ మట్టిని వినియోగిస్తారని చెప్పారు. ఇక్కడి నుంచి వెళ్తున్న బృందం జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని కలెక్టర్ అభిలషించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా పరిషత్ సీఈఓ ఆర్. వెంకటరామన్, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐఎం ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలి

*అనంతగిరి సిపిఐఎం కార్యాలయంలో తేది 01-11-2023 న బస్సు యాత్రను జయప్రదం చేయాలని చలో విజయవాడ ప్రజారక్షణ భేరి పోస్టర్ విడుదల చేసిన అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు,*



అనంతగిరి విజయభాను న్యూస్ : అనంతగిరి ఈ సందర్భంగా జడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు మనకందరికి కలవరపరుస్తున్నాయి రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు కావస్తుంది అప్పుడు మనకు అరచేతిలో స్వర్గం చూపించారు కేంద్రంలోని బిజెపి నాయకులు ప్రత్యేక హెూదా,పోలవరం జాతీయ ప్రాజెక్టు,కడప ఉక్కు ఫాక్టరీ రామయ్యపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం,రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ఫ్యాకేజి కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు కడప ఉక్కురైల్వే జోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటి అమలు కాలేదు రాష్ట్ర ప్రజలను నిలువన మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును అమ్మేసి ఉత్తరాంధ్ర ప్రయోజనాలను దెబ్బకొడుతున్న ప్రభుత్వాలను గద్దెదించాలని హెచ్చరించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సిపిఐఎం మండల కార్యదర్శి సోమేల నాగులు టోకురు సర్పంచ్ కిల్లో.మోస్య జ్యేష్ఠ వెంకటరమణ సిపిఎం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# మోటారు వాహనంలు తోలేవారు అన్ని ప్రభుత్వ అనుమతులు ఉండాలి

**పరిమితులకు మించి ప్రయాణికులను ఎక్కించకూడదు, అతిక్రమిచిన కేసులు పెట్టడం జరుగుతుంది.**

**కె,రాము రాస్ ఐ అనంతగిరి**



అనంతగిరి, విజయభాను న్యూస్ అనంతగిరి ,పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ K. రాము తే 27-10-2023 దీన అనంతగిరి మండలం డముకు జంక్షన్ వద్ద వాహన తనిఖీ చేయుచుండగా, నిమ్మలపాడు వైపు నుండి దముకు వైపు వస్తున్న మూడు ఆటోలు బేరింగ్ నెంబర్ (1). AP 31 TN 3624, (2).AP35 X 3304, (3).AP 31 TF 5052. నెంబర్ గల ఆటోలలో పరిమితికి మించి ప్రయాణి ులను ఎక్కించుకొని వస్తువుండగా, సదరు ఆటోను ఆపి తనిఖి చేయగా, ఆటో డ్రైవర్ లకు డ్రైవింగ్ లైసెన్స్ గాని, ఇన్సూరెన్స్ గాని, ఆటో యొక్క రికార్డ్స్ గాని, లేకపోవడం వలన ఆటో డ్రైవర్ లపైన కేసు నమోదు చేసి, సదరు ఆటోలను సీజ్ చేయడమైనది. ఇకపై అనంతగిరి మండలంలో ఉన్న వాహనదారులు డ్రైవర్లకు ఎటువంటి డ్రైవింగ్ లైసెన్స్ గాని వెహికల్ రికార్డ్స్ గాని లేకుండా వాహనములు నడిపినగాని, లేక మైనర్ బాలికను వాహనాలు ఇచ్చినయెడల వారి పైన వాహన యాజమానుల పైన కూడా కేసులు నమోదు చేసి వాటి యొక్క వాహనములు సీజ్ చేస్తామని తెలియ జేయడమైనది.

# ఎర్ర జెండా తోనే ఆదివాసీ హక్కులు రక్షణ

## ప్రజా ప్రణాళిక ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించి సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స




అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్.. పాడేరు..ఎర్రజెండా గెలుపు తోనే ఆదివాసీ హక్కుల రక్షణ, అభివృధి సాధ్యం మని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స అన్నారు.సి.పి.ఎం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను సి.పి.ఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్. సుందర్ రావు, మండల నాయకులు పి.లక్కు తో కలిసి జిల్లా కార్యదర్శి పి అప్పల నర్సఆవిష్కరించిన ఆనంతరం మాట్లాడుతూ జీఓ నెంబర్ 3 రిజర్వేషన్ ను రద్దై నేటికీ 3 సంవత్సర కాలం అయిన నేటికీ చట్టబద్ధత కల్పించలేదని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాజ్యంగ సవరణ చేసి 5 వ షెడ్యూల్డ్ క్లాజ్ 2 ప్రకారం స్థానిక ఆదివాసీ లకు నూరు శాతం రిజర్వేషన్ కల్పించ వచ్చుని గిరిజన సలహా మండలి (టి. ఏ.సి) తీర్మాణం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ కనీసం బాధ్యతగా వ్యాహరించి, అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపకుండా, బోయ వాల్మీకి ను ఎస్టీ జాబితాలో చేర్పించడం పై అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన జగన్ ప్రభుత్వం ఆదివాసీ రిజర్వేషన్ పై మాత్రం చిత్త శుద్ధి లేదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి లేకఅల్లాడిపోతున్న ఆదివాసీ నిరుద్యోగులకు ప్రభుత్వం నాయవంచనకు గురిచేస్తుంది అన్నారు. స్థానిక ప్రజా ప్రజాప్రతినిధులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తో కనీసం ప్రశ్నించడం లేదని అన్నారు. అటవీ సంరక్షణ చట్టాన్ని సవరణ చేసిన కేంద్రం తో వైసిపి,టి.డి.పి, జన సేన పోరాటం చేయకుండ రాజీపడి తమ అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట మారిందని, కేంద్ర ఎస్టీ సబ్ ప్లాన్ రద్దు చేసిన బి. జె.పి ఆదివాసీ ప్రాంత అభివద్ధికి నిధులు దారి మళ్లించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ను నాన్ బెయిల్ బుల్ సెక్షన్ గా మార్చడంతో ఎస్సీ ఎస్టీ లాపై దేశ వ్యాప్తంగా దాడులు పెరిగిందని అన్నారు. రాజ్యాంగ సవరణలు చేసి రాజ్యాంగాన్ని బలహీన పర్చచి దేశం లో బలహీన వర్గాలకు రాజ్యంగ రాయితీ లను రద్దు చేయడానికి మోడి ప్రభుత్వం కుట్ర పూరితంగా ఉండని అన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరే విధానాల ను ఎండగట్టేందుకు సి.పి.ఎం ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లోకి సి.పి.ఎం బస్ యాత్ర నవంబర్ 30 న సీతం పేట లో సి.పి.ఎం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు బి.వి రాఘవులు ప్రారంభిస్తారు. 1న అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రవేశించి 4 రోజులు పాటు సాగి 9 న విజయ వాడ చేరుతుందని, నవంబర్ 15న విజయ వాడ లో జరిగే బహిరంగ సభ ను విజయ వంతం చేయాలని అన్నారుగిరిజన ప్రాంత సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం తీవ్ర వైపల్యం చెందిందని, కాఫీ రైతుల బకాయిలు, ఉపాధి హామీ, రోడ్డు, రవాణా సౌకర్యాలు లేక ఇప్పటికీ గిరిజనులు డోలిమోతతో ఆసుపత్రికి చేరుతున్నారని అన్నారు. జగన్నన్న సురక్ష పేరుతో ప్రచారం తప్ప గిరిజనులకు వైద్యం అందటం లేదని, గిరిజన అభివృద్ధి కుంటుపడిందని దూయ్యబట్టారు.

రాష్ట్రానికి అనేక ద్రోహం చేసిన బీజేపీని టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు వంత పాడటం మానేసి రాష్ట్రం హక్కుల కోసం బీజేపీని నిలదీయాలనీ, లేకపోతే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తిరగబడతారని, వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ప్రజలు ఒడిస్తారని అన్నారు. అక్టోబరు 3వ వారంలో రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుండి మూడు జాతాలు షెడ్యూలు అక్టోబరు 30న గిరిజన ప్రాంతాలను కలుపుతూ బయలుదేరే జాతా సీతంపేటలో ప్రారంభమవుతుందని తెలిపారు.

# అరకు స్పందనకు విశేష స్పందన స్పందనలో172 వినతులు

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



అరకులోయ :(విజయభాను న్యూస్) అరకు లోయ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు తమ సమస్యలను విన్నపాల రూపంలో తగు పరిష్కారం కోసం కలెక్టర్ కు వినతులు సమర్పించారు. రికార్డు స్థాయిలో 172 విన్నపాలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టర్ తో సహా జిల్లా అధికారులందరూ మండల స్థాయి స్పందనకు హాజరు కావటంతో ప్రజలు పెద్ద ఎత్తున సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. అందులో అధిక శాతం డిఆర్డిఎ, పంచాయతి రాజ్, గృహ నిర్మాణ, ఆర్.డబ్ల్యుఎస్ శాఖల కు చెందిన దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు మరింత చేరువగా మెరుగైన సేవలు అందించటానికి, వారి సమస్యలు అత్యంత దగ్గరగా పరిశీలించటానికి మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన వేదికగా ఉందని చెప్పారు. సమస్యల పరిశ్కారానికి జిల్లా యంత్రాంగం వచ్చినందున సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే నమ్మకంతో ప్రజలు తమ సమస్యలను అర్జీలు రూపంలో సమర్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి సమస్యను పరిశ్కరించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని, ప్రతి సమస్యపై ఒక విచారణ అధికారిని నియమించి సకాలంలో పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో జేసి జే. శివ శ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ సిహెచ్ వెంకటేష్, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, సర్పంచ్ రంజపల్లి ఉషారాణి, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అరకు స్పందనలో అందిన కొన్ని ముఖ్య సమస్యలు అలాగే అరకు నియోజవర్గం లోని పలు మండలాల సమస్యలు క్రింది విధంగా ఉన్నట్లు తెలిపారు బిజెపి ఎస్టీ మోర్చ ప్రతినిధి కె. ఆనంద్ పద్మాపురం ప్రాథమిక పాఠశాల లో 78 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నందున అదనపు ఉపాధ్యాయులను నియమించాలని ధరఖాస్తు సమర్పించారు. అలాగే డుంబ్రిగుడ గదబలుగు గ్రామానికి చెందిన జి. రత్నమ్మ గదబలుగు పాఠశాల నిర్మాణానికి, బాత్ రూమ్ నిర్మాణానికి తన సొంత స్థలం ఎటువంటి పరిహారం తీసుకోకుండా ఉచితంగా ఇచ్చానని, ఆ పాఠశాలలో స్వీపర్ పోస్టులో తనను నియమించాలని అర్జీ సమర్పించారు. అరకులోయ మండలం

బొండాం పంచాయతీ జయంతివలస గ్రామ నికి చెందిన కిల్లో మొత్తి తనకు వచ్చే ఫించను ఆధార్ తప్పుగా మ్యాచింగ్ అయినందున ఫించను ఆగిపోయిందనీ, దానిని సవరించి ఫించను పునరుద్ధరించాలని ధరఖాస్తు ఆమె సమర్పించుకున్నారు.

అనంతగిరి మండలం గుమ్మకోటకు చెందిన పి. సింహాచలం, వి ప్రకాష్ గుమ్మకోట శ్రీ మల్లేశ్వర స్వామి దేవాలయం కు చెందిన జిరాయితీ భూములకు సంబంధించి ఎన్ఓసి జారీ చేయాలని కోరుతూ ధరఖాస్తు సమర్పించారు.

ముంచంగిపుట్టు మండలంలోని పాత సుజనకోట గ్రామం నుండి స్మశాన వాటిక వరకూ శాశ్వత రహదారి నిర్మించాలని, త్రాగు నీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ కి వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

డుంబ్రిగుడ మండలంలోని మాతంగి పంచాయతీ బాకూరుకు చెందిన వలస రమాదేవి తనకు ఫించను అర్హత ఉన్నప్పటికీ ఆధార్ అప్ డేట్ కానందున ఇవ్వడం లేదని, సచివాలయంలో సంప్రదిస్తే కలెక్టర్ ఆదేశాలు తీసుకు రావాలని చెప్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు.

# తోటపల్లి నీరు విడిచిపెట్టండి



రాజాం(విజయభాను న్యూస్) : రాజాంలో తోటపల్లి కార్యనిర్వాహన ఇంజినీర్ అధికారులకు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి , ఎచ్చెర్ల నియోజకవర్గ ఇంచార్జ్ మిడి కళావెంకట రావు వినతిపత్రం అందించారు. శుక్రవారం రాజాంలో తోటపల్లి సెక్షన్ కార్యాలయానికి వెళ్లి మాట్లాడారు. ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం, లావేరు, జి. సిగడాం మండలాలలో సమయానికి వర్షాలు లేక చేతికి అందిన సమయానికి పంట పాడవకుండా, తోటపల్లి ప్రాజెక్ట్ ద్వారా తక్షణమే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలిసినిదిగా కోరుతూ రైతులతో వినతిపత్రం అందజేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గం, రణస్థలం, లావేరు, జి.సిగడాం మండల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వాడీవేడిగా మండల సమావేశం

రాజాం (విజయభాను న్యూస్) : రాజాం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సాదారణ సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ మండల సమావేశంలో తోటపల్లి కాలువ నీరు రైతుల పంటపొలాలుకు అందకపోవడంపై ప్రజా ప్రతినిధులు ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. వరికి చివరి తడి అవసరమని, కాలువలో వెంటనే నీటిని విడిచిపెట్టి, పొలాలుకు అందేలా చూడాలని కోరారు. కంచరాం గ్రామ సచివాలయ జెఎల్ఎమ్ విధులకు హాజరుకావడంలేదని, గ్రామంలో విద్యుత్ సమస్యలు పేరుకుపోయాయని సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు ఆరోపించారు. జెఎల్ఎమ్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు రెట్టింపైన ఉత్సాహంతో సాగిన సామాజిక సాధికర యాత్ర

- టీడీపీ ప్రభుత్వంలా ప్రజలను మేం మోసం చేయలేదు- మంత్రి బొత్స
- పేదలకు అండగా నిలచిన వైకాపా ప్రభుత్వం- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర
- మా ప్రభుత్వంలో చేసిన మంచిని ప్రజలకు వివరిస్తున్నాం- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- మీకు మంచి చేసినవారికే ఓటు వేయండి-మంత్రి ధర్మాన ప్రసాదరావు





గజపతినగరం (విజయభాను న్యూస్): వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను రెండవ రోజు గజపతినగరంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, మేరుగు నాగార్జున, మాజీ మంత్రి పుష్పశ్రీవాణి, తదితరులు ప్రారంభించారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డీ, మంత్రి రాజన్న దొర,మంత్రి ధర్మాన, గజపతినగరం ఎమ్మెల్యే బొత్సా అప్పలనర్సయ్య పాల్గొని సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ప్రసగించారు. 2014 ఎన్నికల్లో 600కు పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా మోసం చేశారని, ఆయన నయవంచ కుడని మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి సామాజిక సాధికార యాత్రను ప్రారంభించామన్నారు. సీఎంజగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనలో ఏ విధంగా సామాజిక న్యాయం చేశారన్నది ప్రజలు తెలియజేప్పేందుకు బస్సు యాత్రను ప్రారంభించామన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయా నియోజక వర్గాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. మొదటి రోజు బస్సు యాత్రను ప్రజలు విజయవంతం చేశారని, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుం దన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తున్నామన్నారు.



చంద్రబాబు మాదిరిగా మేం మోసం చేయడం, వంచించడం మాకు అలవాటు లేదు. చెప్పింది చేస్తున్నారు, మాట తప్పని నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. టీడీపీది మాట తప్పిన పార్టీ, అన్ని వర్గాలను గత ప్రభుత్వం మోసం చేసింది. మేం ఈ నాలుగున్నరేళ్లలో ఎలా పాలించామో ప్రజలకు వివరిస్తున్నామన్నారు. టీడీపీ చేసిన వంచన, అవినీతిని ఎండగడుతున్నామన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వం ఎలా వాగ్ధానాలు చేసిందో మీ అందరికీ తెలుసు అన్నారు. 650 వాగ్ధానాలు వారి మేనిఫెస్టోలో పెట్టారని, చంద్రబాబు సీఎం అయ్యాక మొదటి రోజు ఐదు సంతకాలు చేశారని, వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. రూ.87 వేల కోట్లు రైతు రుణాలు మాఫీ చేస్తానని నట్టేట ముంచారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని దగా చేశారు. బెల్ట్ షాపులు రద్దు చేస్తామని చెప్పి విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులై పారించారన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు ఇస్తామని మోసం చేశారు. మళ్లీ తగుదునమ్మా అంటూ ఎన్నికల సమయంలో వస్తున్నారు. ఇలాంటి వంచకుల మాటలు నమ్మాలా? అని మంత్రి ప్రశ్నిచంచారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచిన సీఎం జగన్ తాలుకా విధానం, అభిమతం, ఆయన లక్షణం, ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నైజాన్ని ప్రజలకు వివరించేందుకు బస్సు యాత్ర ద్వారా బయలుదేరామన్నారు. గతంలో విజయనగరం జిల్లాను టీడీపీ ఎలా మోసం చేసిందో ప్రజలక వివరిస్తున్నామన్నారు. సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. చంద్రబాబు ఎన్ని లేఖలైనా రాసుకోవచ్చని, చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. చంద్రబాబు తప్పు చేయకపోతే కోర్టు ఎందుకు రిమాండుకు పంపిందని, ప్రభుత్వం ఆయనకు శిక్ష వేయలేదన్నారు.

### పేదలకు అండగా నిలచిన ప్రభుత్వం వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

బీసీలకు, ఎస్సీలకు రాజ్యాధికారం ఇచ్చింది అంబేద్కర్ అని కానీ ఆయన ఆశయాలను ఎవరూ అమలు చేయలేదని గిరిజన శాఖ మంత్రి రాజన్నదొర అన్నారు. జగన్ సీఎం అయిన వెంటనే మనసు, మానవత్వంతో ఆలోచించి గిరిజనుడికి, దళితుడికి, బీసీలకు రాజ్యాధికారం అవకాశం ఇచ్చారని, కుల మతాలకు సంబంధం లేకుండా అవకాశాలు కల్పించింది వైఎస్సార్సీపీ ప్రభుత్వమని ఉద్ఘాటించారు.

"రాష్ట్రంలో జరుగుతున్న మంచి గతంలో ఎందుకు జరగలేదు? గత ప్రభుత్వాలు రుణమాఫీ అని చెప్పి మాఫీ చేయకుండా మోసం చేశారు?కానీ, సీఎం జగన్ మహిళలకు, రైతులకు ఉన్న రుణాలు మాఫీ చేసి పేదలకు అండగా నిలచారు. మీకు జరిగిన మంచిని గుర్తించండి" అని రాజన్నదోర పేర్కొన్నారు

### సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నాం: మంత్రి బూడి ముత్యాలనాయుడు

సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. అవినీతికి చోటు లేకుండా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించామన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని, నాడు%--%నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. జరిగిన అభివృద్ధిని బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళు_న్నామన్నారు. అవినీతికి చోటు లేకుండా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించామన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ నెరవేర్చారని, మా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను బస్సు యాత్రలో ప్రజలకు వివరిస్తున్నా మన్నారు. వెనుకబడిన వర్గాలకు ఆర్థిక చేయూతనందించిన ఘనత సీఎం జగన్ దే అని ఉద్ఘాటించారు. సమన్యాయంతో అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నా మన్నారు. సామాజిక సాధికారత అనే మాటకు సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని తెలిపారు.

"నేను ఉన్నాను.. నేను విన్నాను అన్న నాయకుడు సీఎం జగన్. సీఎం జగన్ పాలనలో సామాజిక న్యాయం జరుగుతోంది. అన్ని కులాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించారు. అర్హులందరీకి అభివృద్ధి, సంక్షేమ పలాలు అందిస్తున్నాం. కులం మతం తో సంబంధం లేకుండా మంత్రి పదవులు ఇచ్చారు. ప్రతి గ్రామం లో సచివాలయం ఏర్పాటు చేసి, నిరుద్యోగులను వాలంటర్ లు గా నియమించి ప్రభుత్వ సేవలు ఇస్తున్నాం. ప్రతి పేదవాడి మొహం లో చిరునవ్వు చూడాలని సామజిక న్యాయం చేస్తున్నాం" అని మంత్రి బూడి స్పష్టం చేశారు

### చంద్రబాబు మోసాలను గుర్తించండి: మంత్రి మేరుగు

ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం ఇచ్చింది సీఎం జగన్ అని, బీసీలు తోక కత్తిరిస్తామని, మీ అంతుచూస్తామని చంద్రబాబు మంత్రి మేరుగు నాగార్జన మాట్లాడారు. చంద్రబాబు మోసాలను జనం గమనించాలని, 2014 ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ కలిసి పోటీ చేసి 650 హామీలు ఇచ్చారని కానీ ఒక్కటి కూడా అమలు చేయకుండా మ్యానిఫేస్టోని చెత్త బుట్టలో వేసేశారని మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు.

### మీకు మంచి చేసినవారికే ఓటు వేయండి:మంత్రి ధర్మాన ప్రసాదరావు

"ప్రజలు బ్యాంకుల్లో అప్పులు అయిపోయారు, నాకు ఓటు వేయండి అప్పులు తీర్చుతామని 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పాడు. అప్పులు తీర్చలేదు. మేం 5 ఏళ్ల క్రితం చంద్రబాబు మోసం చెప్పాం. అందుకే మీరు మాకు ఓటు వేశారు. మేం అధికారం లోకి వచ్చాక వారి బ్యాంకు ఖాతాల్లో మూడు విడుతలు డబ్బులు వేసి నాలుగో విడత వేయడానికి సిద్ధం గా ఉన్నాం. ఇది కదా మాట నిలబెట్టుకోవడం" అని మంత్రి ధర్మాన ప్రసాద్ అన్నారు

చంద్రబాబు పాలనలో రైతులు రుణాలు తీర్చలేకపోతే బ్యాంకులు అవమానించాయని, జగన్ పాలనలో సక్రమంగా రైతు బరోసా ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారని, ఎన్నికల్లో మోసం చేసిన వాడికి ఓటు వేయవద్దని మంత్రి సూచించారు. రాజకీయాల్లో తప్పు చేసిన వాడికి ఓటు వేస్తే 5 సంవత్సరాలు నష్టపోతామని పేర్కొన్నారు. ఒక్కసారి జగన్కి ఓటు వేస్తే 30లక్షల మందికి ఇళ్లు ఇచ్చారని, ఇలాంటి వారికి ఓటు వేయాలి కదా అని మంత్రి హితవు పలికారు.

# నేటి నుండి ఓటరు జాబితాలో అభ్యంతరాల స్వీకరణ

జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా నిర్వహించిన ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ ఈ నెల 27న జరిగిందని, వాటిలో అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల ముసాయిదా ప్రచురణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శుక్రవారం ఉదయం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 19 లక్షల 15 వేల 682 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో 9 లక్షల 51వేల 11మంది పురుషులు, 9 లక్షల 64 వేల 538 మంది మహిళలు, 133 మంది థర్డ్ జెండర్ ఉన్నట్లు వివరించారు. ప్రచురణ అయిన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రతులను గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలకు అందజేయడం జరుగుతుందని, అలాగే సంబంధిత పోలింగు కేంద్రం వద్ద, బూత్ లెవల్ అధికారి, మండల తహశీల్దారు, కలెక్టరు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. ఓటరు లిస్టులను ప్రతి ఒక్కరు పరిశీలించు కోవాలని, వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఫారం 6, 7, 8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని,ముసాయిదా లోని క్లైములు, అభ్యంతరాలను అక్టోబర్ 27 నుండి డిసెంబరు 9 వరకు స్వీకరించడం జరుగు తుందని తెలిపారు. అభ్యంతరాలను డిసెంబరు 26 నాటికి పరిష్క రించడం జరుగు తుందని 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నవంబర్ 4, 5 తేదీల్లో మరియు డిసెంబర్ 2, 3 తేదీల్లో (శని, ఆదివారాలు) ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగు తుందని, అందులో కూడా తమ అభ్యంతరాలను స్వీకరించడం జరుగు తుందన్నారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేస్తే వాటిని సరిదిద్దుటకు చర్యలు తీసుకోవడం జరుగు తుందని, తుది జాబితా తదుపరి అభ్యంతరాలు లేకుండా సహకరించాలని రాజకీయపార్టీలు, ప్రజలు సహరించాలని కోరారు.

ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, జిల్లా రెవిన్యూ అధికారి కె. మోహన్ కుమార్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి ఎన్.విజయానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్.సుధాకర్, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి పాసర్ల ప్రసాద్, వై.ఎస్.ఆర్ సి.పి ప్రతినిధి జి.రవికుమార్,బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి బి.కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి కె.ఎం.రాజు, సిపిఐ(ఎం) పార్టీ ప్రతినిధి వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుధాలు ప్రదర్శన తిలకించాలి

పోలీసులు నిత్యం ఉపయోగించే సాధనాలుపై విద్యార్ధులకు అవగాహన.

జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక.



శ్రీకాకుళం,అక్టోబర్ 27. పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాలలో భాగంగా ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ కమ్యూనిటి హాల్ నందు ఏర్పాటు చేసిన ఓపెను హౌస్ కార్యక్రమంలో ఆయాధాలు ప్రదర్శనను విద్యార్థులు తిలకించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు.పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎచ్చెర్ల లోని ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు కళ్యాణమండపం లో జిల్లా ఎస్పీ జి. ఆర్.రాధిక పోలీసు ఆయుధాల ప్రదర్శన (ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్) ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు విధి నిర్వహణలో నిత్యం ఉపయోగించే ఆయుధాలు,వాటి పనితీరు,సాంకేతిక పరికరాలు, పోలీసులు జాగిలాలు,బాంబు నిరవీర్యం సాధనలను, గురించి ఎస్పీ స్వయంగా విద్యార్థులకు వివరించారు. ఈ ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ రెండు రోజులు పాటు నిర్వహిస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వారు వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేర దర్యాప్తు విధానం,కమ్యూనికేషన్, తదితర విషయాలను ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయడానికి ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల యొక్క శ్రేయస్సు, దేశ రక్షణకు ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను స్మరించుకుంటూ అమరవీరుల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లోని సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయంలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ప్రజా రక్షణకై అనేక రకాలైన సేవలు అందుబాటులోకి వచ్చాయిని పోలీసు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమాలో వివిధ రకాల తుపాకులు, ఆయుధాలు,విడి భాగలు మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, రాకర్, బాంబు డిస్పోజల్ పరికరాలు, ఫింగర్ ప్రింట్, పోలీస్ కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్స్, నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్ స్క్వాడ్ బృందాలు,అన్ని రకాల తుపాకలు తదితర పరికరాలు పై ఎస్పీ గారు విద్యార్థులకు, ప్రజలకు విపులంగా తెలిపారు.అదేవిధంగా ఈ ఓపెన్ హౌస్ కార్యక్మంలో పోలీసులు విధి నిర్వహణలో వాడే ఆయుధాలు, వాటి విడిభాగాల పనితీరు,దిశా యాప్,దిశ దర్యాప్తు,మొబైల్ వాహనాలలో ఉన్న సౌకర్యాలు,డయల్ -100 పనిచేయు విధానం గురించి ఎస్పీ విద్యార్ధులకు, ప్రజలకు స్వయంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వర్,సిఐ ఆదాం,ఆర్.ఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ.రాజేష్,ఆర్ ఎస్ఐలు, విద్యార్థులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులకు శాపం.. అటిజం!

మెడ నిలపటం, పాకటం, తప్పటడుగులు, అత్తతాతలు.. పిల్లల ఎదుగుదల క్రమంలో ప్రతిదీ ఒక పండేగ. వీటిలో ఏదైనా తేడా వచ్చినప్పుడు తల్లిదండ్రులు తేలికగానే గుర్తుపడతారు.. వెంటనే దృష్టిసారిస్తారు కూడా. కానీ ఈ గడపలన్నీ దాటి.. ప్రయాణం బాగానే సాగుతోందనుకుంటున్న తరుణం లో కూడా కొన్ని సమస్యలు ఉండొచ్చు. వీటిని గుర్తిం చటం అంత తేలిక కాదు. వాటిని పట్టుకోవటానికి కాస్త అవగాహన అవసరం. ఇలాంటి సమస్యల్లో ముఖ్యమైనదీ.. ఇప్పటి వరకూ పాశ్చాత్య దేశాల్లోనే ఎక్కువ అనుకుంటున్నదీ... సంపన్న వర్గాల్లోనే ఎక్కువ అనుకుంటున్నదీ.. మన దేశంలోనూ, అన్ని వర్గాల్లోనూ ఎక్కువేనని ఇప్పు డిప్పుడే స్పష్టంగా బయటపడు తున్నదీ... ఆటిజం! ఆటిజం భిన్న విభాగాలకు విస్తరిం చిన ఎదుగుదల సమస్య. దీన్నే పర్వేసి డెవలప్‌మెం టల్ డిసార్డర్స్ అంటారు. వీరందరిలోనూ కొన్ని రకాల లక్షణాలు ప్రత్యేకంగా కన బడతాయి. కొన్ని అంశాల్లో ఎదుగుదల అస్తవ్యస్తమవు తుంది. ముఖ్యంగా మూడు అంశాలను ప్రత్యేకంగా గమనించొచ్చు.

**ఇతరులతో కలవలేకపోతుండటం:** ఆటిజం పిల్లలు తోటి పిల్లలతో ఆడుకోవటానికి అంతగా ఇష్టపడరు. ఒంటరిగా ఆడుకోవటం, ఒంటరిగా గడపటం ఎక్కువ.

**భావవ్యక్తీకరణ లోపం:**

మాటలు రావటం జాప్యం కావచ్చు. వచ్చినా పూర్తిస్థాయిలో ఉండకపోవచ్చు. తమ అవసరాలను తీర్చుకునేందుకు వేలుపట్టుకుని అక్కడి వరకూ తీసుకువెళ్ళటం వంటివి చేస్తుంటారు.

**ప్రవర్తన లోపాలు:**

చేసిందే మళ్లీ మళ్లీ చేస్తుండటం, ఒకపనిని



ఎప్పుడు చేసినా తిరిగి అలాగే చెయ్యాలని ప్రయత్నిస్తుం డటం... రోజూ తాము వాడే టాయిలెట్‌నే వాడతామం టారు. రెండోదానిలోకి వెళ్ళనని మొరాయిస్తుంటారు. కొందరు సంతోషం కలిగితే చేతులను కాళ్ళను పైకీ కిందికీ అదేపనిగా ఆడిస్తారు. మరి కొందరు సూదులు, గుండుపిన్నుల వంటి జేక రకం వస్తువులను సేకరిస్తుంటారు..... ఆటిజం పిల్లల్లో సాధారణంగా ఈ మూడు లక్షణలూ ఉంటాయి. కొందరిలో ఒకటిరెండు మాత్రమే ఎక్కువగా కనబడినా అన్ని లక్షణలూ ఏదో ఒక స్థాయిలో కనబడతాయి. అమెరికా డయాగ్నోస్టిక్ అండ్ స్టాటిస్టికల్ మాన్యువల్‌లో దీన్ని పర్వేసి డెవలప్‌మెంటల్ డిజార్డర్ కింద దీన్ని వర్గీకరించారు. ఈ లక్షణాలు ఆరంభమైన సమయం, తీవ్రత, క్షీణిస్తున్న తీరు తదితర అంశాలను బట్టి దీన్ని ప్రధానంగా 5 రకాలుగా విభజించారు.

**ఆటిస్టిక్ డిజార్డర్:**

ఎక్కువగా కనబడే ఆటిజం సమస్య ఇదే. దీన్ని చైల్డ్‌హుడ్ ఆటిజం అంటారు. ఇది ఆడ పిల్లల్లో కన్నా మగపిల్లల్లో ఎక్కువ. మున్ముందు వివరంగా చూద్దాం.

**రట్స్ డిజార్డర్:**

అరుదైన ఈ రకం ఆడపిల్లల్లో ఎక్కువగా కనబడుతుంది. దీని ప్రత్యేకతేమంటే.. పుట్టిన ఏడాది వరకూ పిల్లలు బాగానే ఉంటారుగానీ తర్వాత లక్షణాలు కనబడటం మొదలవుతుంది.

ఇవి రెండు మూడేళ్ళలోనే వేగంగా తీవ్రమవుతాయి. అప్పటికి వచ్చిన ఒకటిరెండు మాటలు కూడా తిరిగి వెనక్కి వెళ్లిపోతాయి. ఇది ముదిరే రకం (ప్రోగసి డిజార్డర్) కావటం వల్ల కొంతకాలానికి నాడీ సంబంధ సమస్య లూ ఆరంభమవుతాయి. సరిగా నడుము నిలపలేక పోతుండటం వంటివాటితో మొదలై మెల్లగా ఫిట్స్ కూడా వస్తాయి. సాధారణంగా వయసుతో పాటు పెర గాల్సిన తల వీరిలో చిన్నదవుతుంటుంది. చొంగ కారటం, చేతులుకాళ్లు జేక రకంగా ఆడిస్తుండటం, చేతులతో చప్పుళ్లు చేయటం వంటివి కనబడతాయి. యుక్తవయసుకు ముందే సమస్యలు బాగా ముదిరి వీరు బతికిబట్టకట్టటం కూడా కష్టమవుతుంటుంది.

**ఆస్పర్జెర్స్ డిజార్డర్:**

ఇది మగ పిల్లల్లో ఎక్కువ. సాధారణంగా ఆటిజం పిల్లల్లో మాటలు ఆలస్యంగా వస్తుంటాయి. కానీ ఈ రకంలో మాటలు మామూలుగానే ఉంటాయి. నలుగురిలోకి వెళ్ళటం, తెలివి తేటలు కూడా బాగానే ఉంటాయి. కానీ తక్కువగా మాట్లాడతారు. అడిగిన దానికి సమాధానం చెప్పేసి ఆపేస్తారు. శరీరాకృతి భిన్నంగా ఉంటుంది. పొడుగ్గా ఉంటారు. పొడవైన ముంతో పాటు చెవులూ భిన్నంగా ఉంటాయి. మిగతా ఆటిజం పిల్లలతో పోలిస్తే ఇతరులతో బాగానే కలు స్తారు కాబట్టి వీరిలో భాషా నైపుణ్యాలు కాస్త ఎక్కువ గానే అలవడతాయి. కొంతవరకూ బాగానే చదువు తారు. కొన్ని పనుల్లో ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు.

# పిత్తాశయంలో రాళ్ళ తొలగించే నేచురల్ ఫుడ్స్



**ప్రస్తుత** రోజులో గాల్ స్టోన్స్(పిత్తాశయంలోరాళ్ళు) ఒక సాధారణ సమస్యగా ఉంది. అదృష్టవశాత్తూ, గాల్ స్టోన్ నివారించుకోవండానికి కొన్ని హోం రెమెడీస్ ఉన్నాయి. ఈ గాల్ బ్లాడర్ అనేది చిన్న అవయం లివర్ కు వెనుకభాగంలో ఉంటుంది. పిత్తాశయం అనేది ఒక సంచి వంటి నిర్మాణం. ఇది కాలేయం కింది భాగంలో ఉంటుంది. ఆహారం అరుగుదలకు ఉపయోగపడే స్రావాలను నిల్వ ఉంచుతుంది. ఇవి కాలేయం నుండి ప్రవిస్తాయి. పిత్తాశయంలో రాళ్ల అనేవి కొలెస్ట్రాల్, పిగ్మెంట్స్‌వల్ల ఏర్పడిన ఘనపదార్థాలు. ఇవి సన్నని ఇసుకు రేణువు పరిమాణం నుండి గోల్ఫ్‌బాల్ పరిమాణంలోగానీ, గుండ్రంగాగానీ, నున్నగాగానీ ఉండవచ్చు. వీటికి చికిత్స తీసుకోకపోతే తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చు. కొన్నిసార్లు ప్రాణాంతకం కావచ్చు. కొన్ని సందర్భాల్లో కొలెస్ట్రాల్, బిలిరుబిన్ మరియు బైల్ సాల్ట్ ల కారణంగా గాల్ బ్లాడర్లో స్టోన్స్ ఏర్పడుతాయి . 80 శాతం గాల్ స్టోన్స్ కొలెస్ట్రాల్ వల్లే ఏర్పడుతాయి. ముఖ్యంగా ఇవి కొద్దిగా ఘనంగా ఏర్పడుతాయి. గాల్ బ్లాడర్ లో ఏర్పడే గాల్ స్టోన్స్ చాలా పెద్దగా లేదా చాలా చిన్నది గాను ఉంటుంది . గాల్ బ్లాడర్ లో ఒక్కసారిగా స్టోన్స్ ఏర్పడినప్పుడు, ఒక్కసారిగా పిత్తప్రవాహాన్ని నిరోధిస్తుంది అలాంటి పరిస్థితుల్లో నొప్పి, కాలేయం లేదా క్లోమపు వాపుకు దారితీస్తుంది. గాల్ బ్లాడర్లో రాళ్ళు ఏర్పడినప్పుడు పొట్ట ఉబ్బరం, తేన్పులు, ఎసిడిటి, అరుగుదల లేకపోవ డం వంటి లక్షణాలతో ఇబ్బందిపడుతున్నారా? అయితే పిత్తాశయంలో రాళ్లు (గాల్‌స్టోన్స్) ఉండవచ్చని అనుమానించవచ్చు. ఎందుకంటే ఈ లక్షణాలు ఉదర సంబంధ వ్యాధికి సంబంధించినవి కావచ్చు. పిత్తాశ యంలో రాళ్లు ఉన్నప్పుడు కనబడే లక్షణాలు కావ చ్చు. ఉదరభాగం కుడివైపు నొప్పి, పొట్ట ఉబ్బరంగా ఉండటం, ముఖ్యంగా కొవ్వు పదార్థాలు ఆహారంలో తీసుకున్నప్పుడు, గాల్‌స్టోన్స్ ఏర్పడినప్పుడు సంభ విస్తుంది. దీనిని వైద్య పరిభాషలో 'కొలి లిథియాసిస్' అని అంటారు. గాల్ బ్లాడర్ లో స్టోన్ ఏర్పడితే, అకస్మాత్ గా నొప్పి ముఖ్యంగా పొట్ట ఉదయం కుడి వైపు, బ్యాక్ పెయిన్, వికారం లేద వాంతులు, కడుపు ఉబ్బరం, అజీర్తీ, చలి వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. =జూ్యా మీ=జు: పిత్తాశయంలో రాళ్ళను సహజంగా తొలగించడం ఎలా ? ఇలాంటి పరిస్థితిలో సరైన జీవనశైలిని మెయింటైన్ చేయకపోతే గాల్ స్టోన్ ఏర్పడే అవకాశం ఉంది. గాల్ స్టోన్ ప్రభావం వల్ల ఊబకాయం, డయాబెటిస్, లివర్ డిసీజ్, గర్భధారణ, సరైన జీవనశైలిపాటించకపోడం ఎక్కువ పాట్ ఉన్న ఆహారాలు తీసుకోవడం, అనీమియా గాల్ స్టోన్ ప్రమాధాన్ని కలిగిస్తుంది. గాల్ స్టోన్స్ నివారించే కొన్ని ఉత్తమ నేచురల్ ఫుడ్స్ ఈ క్రింది విధంగా...

**గాల్స్ స్టోన్స్ ను తొలగించే బెస్ట్ నేచురల్ ఫుడ్స్ పీయర్స్ (బేరి పండ్లు):** పీయర్స్ లో ఉండే పెక్టిన్ అనే కాంపౌడ్ గాల్ స్టోన్ కొలెస్ట్రాల్ ను పాస్ట్ చేసేందుకు సహాయపడుతుంది, కాబట్టి, ఇవి శరీరం నుండి బయటకు నెట్టివేయడానికి గ్రేట్ గా సహాయపడు తుంది. ఇంకా గాల్ స్టోన్ ద్వారా వచ్చే నొప్పిని మరియు ఇతర లక్షణాలను నివారిస్తుంది.

**ఆముదం:** గాల్ స్టోన్ నివారిస్తుంది మరియు గాల్ స్టోన్స్ ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఆముదం లో యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలు నొప్పిని తగ్గిస్తాయి. ఆముదంలో వ్యాధినిధోకతను పెంచే శోషరస వ్యవస్థ సానుకూల ప్రభావం కలిగి ఉంటుంది. కాస్ట్రాల్ ఆయిల్ తో మసాజ్ చేస్తే నొప్పి తగ్గించుకోవచ్చు.

**నిమ్మరసం:** నిమ్మరసం సిట్రస్ ఫ్రూట్ గాల్ బ్లాడర్ లో కొవ్వు చేరకుండా సహాయపడుతుంది. దాంతో గాల్ స్టోను ఏర్పడకుండా నివారిస్తుంది. లెమన్ జ్యూస్ ను రోజుకు మూడు సార్లు తీసుకోవచ్చు.

**విటమిన్ సి**: విటమిన్ సి బైల్ యాసిడ్స్, ను కొలెస్టాల్ గా మార్చేందుకు సహాయపడుతుంది. తద్వారా గాల్ స్టోన్ కరిగించబడుతుంది అందుకు మీరు విటమిన్ సి సప్లిమెంట్ లేదా విటమిన్ సి అధికంగా ఉండే ఆరెంజ్, టమోటో వంటి సిట్రస్ పండ్లను ఎక్కువగా తీసుకోవడం వల్ల గాల్ స్టోన్ నొన్పిని తగ్గించుకోవచ్చు.

**పెప్పర్మింట్ టీ:** పుదీనా ఇది బైల్ ఫ్లూను మరియు డైజెస్టివ్ జ్యూస్ ను ఉత్పత్తి చేయడంలో ఉత్తేజ పరుస్తుంది. ఇందులో ఉండే టెర్పేన్ అనే కాంపౌడ్ గాల్ స్టోన్ ను చాలా ఎఫెక్టివ్ గా కరిగిస్తుంది. మరియు ఇది కూడా పిత్తాశయ నొప్పి మరియు దుస్సంకోచాలు విశ్రాంతి కలిగించి ఉపశమనానికి సహాయపడుతుంది. ఈ ఆకులను ఉడికించి పిప్పర్ మెంట్ టీ తయారుచేయవచ్చు.

**బీట్ రూట్, పీర్, మరియు ఆపిల్ జ్యూస్:** గాల్ స్టోన్ నివారించుకోవడంలో ఒక ఎఫెక్టివ్ నేచురల్ హోం రెమెడీ. పచ్చి బీట్ రూట్ జ్యూస్, పీర్, మరియు ఆపిల్ జ్యూస్ వంటివి లివర్ ను శుభ్రపరుస్తుంది. గాల్ స్టోన్ నివారిచడానాకి ఈ మూడింటి మిశ్రమంతో జ్యూస్ చేసి త్రాగాలి.

## గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగించే.. ఉత్తమ ఇంటి చిట్కాలు

**గొం**తు నొప్పితో బాధపడుతున్నట్లైతే వెంటనే మనం ఉప్పు నీటితో మరీ గోరువెచ్చని నీటితో గార్లింగ్ చేస్తుంటాము. ఇది కేవలం సొర్ త్రోట్ (గొంత నొప్పి) నుండి ఉపశమనం కలిగించే హోం రెమెడీ ఇది ఒక్కటే అనుకుంటారు. కానీ గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగించే హోం రెమెడీస్ అనేకం ఉన్నాయి. అవి కూడా. ముఖ్యంగా ఈక్రింది లిస్ట్‌లో తెలిపిన 7 బెస్ట్ నేచురల్ సోర్ థ్రోట్ రెడీస్ ను పరిశీలించండి. ఈ హోం రెమెడీస్ చాలా సింపుల్ గా ఉంటాయి . కానీ చాలా ఎఫెక్టివ్ గా పనిచేస్తాయి.

**గొంతు నొప్పి నుండి**
**తక్షణ ఉపశమనం కలిగించే విటమిన్స్ ఫుడ్స్**

గొంతు నొప్పితో బాధపడే ఈ హోం రెమెడిస్ కంటే మరింత వేగంగా మరే ఇతర మెడిసిన్స్ పనిచేయవు. చాలా ఎఫెక్టివ్ గా వేగంగా గొంతు నొప్పిని నివారిస్తాయి కొన్ని మందులు ప్రస్తుతానికి ఉపశమనం కలిగించినా మాత్రలు నిలిపేస్తే తిరిగి పునరావృతం అవుతుంది. కానీ ఈ హోం రెమెడీస్ ద్వారా గొంతు నొప్పి మరియు ఇన్ఫెక్షన్ నుండి త్వరగా ఉపశమనం కలిగిస్తుంది.

**ఈ జ్యూసులతో జలుబు, గొంతు నొప్పి మటు మాయం**

గార్గిలింగ్ ద్వారా గొంతు నొప్పి, క్రిములను నాశనం చేయవచ్చు. మరియు గొంత నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. మరి దీంతో పాటు మరొకొన్ని ఎఫెక్టివ్ హోం రెమెడీస్ ఈ క్రింది విధంగా...

**లెమన్ వాటర్:** హోం మేడ్ సోర్ థ్రోట్ హోం రెమెడీ. ఒక గ్లాసు నీళ్ళలో నిమ్మరసం మిక్స్ చేసి బాగా మిక్స్ చేయాలి. ఈ ఆస్ట్రిజెంట్ జ్యూస్ గొంత వాపును తగ్గి స్తుంది మరయి వైరస్ మరియు బ్యాక్టీరియాను గొంతులో చేరకుండా నిరోధిస్తుంది . అయితే ఎక్కువ నిమ్మరసం వేయకుండా చాలా తక్కువగా మిక్స్ చేసుకోవాలి.

**టమోటో జ్యూస్:** గొంతు నొప్పి నుండి తక్షణం ఉపశమనం పొందాలనుకుంటే, దీన్ని త్రాగవచ్చు. హాట్ వాటర్ మరియు టమోటో జ్యూస్ ను సమంగా తీసుకొని త్రాగాలి. ఇందులో కొద్దిగా పెప్పర్ సాస్ మిక్స్ చేసి త్రాగవచ్చు లేదా గార్గిలింగ్ చేయవచ్చు. ఈ మిశ్రమం గొంతు నొప్పి నివారించడంలో గ్రేట్ గా సహాయపడుతుంది. **అల్లం, తేనె, మరియు లెమన్ వాటర్:** గొంతు నొప్పి నివారించడానికి ఒక ఎఫెక్టివ్ హోం రెమెడీ. ఇది అల్లం మరియు తేనెను వేడి నీటిలో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయాలి. ఈ నీటిని నోట్లో పోసుకొని గార్గిలింగ్ చేయడం వల్ల తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.

**పసుపు మరియు వాటర్:** ఇంట్లో పొడి చేసుకొన్న పసుపులో అనేక బ్యూటీ అండ్ హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. పసులో యాంటీ బ్యాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. మరియు యాంటీ యాక్సిడెంట్స్ లక్షణాలు అనేక వ్యాధులతో పోరాడే లక్షణాలు కలిగి ఉన్నాయి. కాబట్టి ఒకటీస్పూన్ పసుపు గోరువెచ్చని ఒక గ్లాసు నీళ్ళలో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయడం లేదా గోరువెచ్చగా త్రాగడం వల్ల తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. గొంతు నొప్పికి ఇది ఒక బెస్ట్ హోం రెమెడీ.

**లవంగాల టీ:** వేడి నీటిలో ఒక టీస్పూన్ లవంగాలపొడి వేసి బాగా మిక్స్ చేసి నోట్లో పోసుకుని గార్గిలింగ్ చేయాలి. లవంగాల టీలో యాంటీ బ్యాక్టీరి యల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి గొంత నొప్పి నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.

**గ్రీన్ టీ:** బరువు తగ్గిచడంతో పాటు వ్యాధినిరో ధకతను పెంచి మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందించే మ్యాజికల్ టీ గ్రీన్ టీ. గోరువెచ్చని గ్రీన్ టీ గొంత నొప్పి నుండి ఉపశమనం కలిగించడంతో పాటు బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది.

**హాట్ సాస్ మరియు వాటర్:** హాట్ సాస్ పేరు వింటే కొద్దిగా భయం వేస్తుంది. కానీ చాలా ఎఫెక్టివ్ గా వెంటనే ఉపశమనం కలిగిస్తుంది. తక్షణ ఉపశమనం పొందడానికి కేయాన్ పెప్పర్ సాస్ ను హాట్ వాటర్లో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయడం లేదా గోరువెచ్చగా త్రాగడం వల్ల కూడా వెంటనే ఉపశమనం కలిగిస్తుంది. ఇది నొప్పిని మరియు ఇన్ఫ్లమేషన్ ను తగ్గిస్తుంది.

## శీతాకాలంలో క్యారెట్లతో చర్మ సంరక్షణ ఇలా..!



శీతాకాలంలో సహజంగానే ఎవరి చర్మం అయినా పగులుతుంటుంది. చర్మం పొడిగా మారి కొందరికి దురద కూడా వస్తుంటుంది. అయితే శీతాకాలంలో చర్మాన్ని మృదువుగా, తేమగా ఉంచుకోవాలంటే అందుకు క్యారెట్ ఎంతగానో పనిచేస్తుంది. దాంతో చర్మాన్ని ఎలా సంరక్షించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. క్యారెట్ సగం ముక్క తీసుకుని దాన్ని తురుం పట్టి మిక్సీలో వేసి పేస్ట్ చేసుకోవాలి. ఆ మిశ్రమంలో ఒక టీస్పూన్ తేనె, ఒక టీస్పూన్ పాలు వేసి బాగా కలిపి చర్మానికి రాయాలి. 15 నిమిషాల తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమగా మారుతుంది. పగలకుండా ఉంటుంది. దీన్ని ముఖానికి ఫేస్ ప్యాక్‌గా కూడా వేసుకోవచ్చు. ఆయిలీ స్కిన్ ఉన్నవారికి కూడా క్యారెట్లు ఎంతో మేలు చేస్తాయి. చర్మం నుంచి విడుదలయ్యే నూనెలాంటి ద్రవాన్ని క్యారెట్లలో ఉండే విటమిన్ ఎ బయటకు పంపుతుంది. దీంతో చర్మం మృదువుగా మారుతుంది. క్యారెట్ జ్యూస్ ఒక కప్పు తీసుకుని అందులో పెరుగు, శనగపిండి, నిమ్మరసంలను ఒక్కో టేబుల్ స్పూన్ చొప్పున వేసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు ప్యాక్‌గా వేసుకోవాలి. 30 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే ఆయిలీ స్కిన్ నుంచి విముక్తి పొందవచ్చు. క్యారెట్ జ్యూస్, పెరుగు, ఎగ్ వైట్‌లను సమపాళ్లలో కలిపి మిశ్రమంగా చేసి దాన్ని ముఖానికి రాసుకుని 15 నిమిషాలు ఆగాక గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. దీంతో చర్మంపై ఉండే డెడ్ స్కిన్ సెల్స్ తొలగిపోతాయి. చర్మం తాజాగా మారుతుంది. ముఖ సౌందర్యం పెరుగుతుంది.

# తేనె చేసే మేలు



తేనె చేసే మంచి అంతా ఇంతా కాదు. అందాన్నీ, ఆరోగ్యాన్నీ పెంచడంలో తేనె కీలకపాత్ర పోషిస్తుంది. అందుకే దీనిని రకరకాలుగా ఉపయోగిస్తుంటారు. అజీర్తి, నోటి దుర్వాసన వంటి సమస్యలకు తేనె మంచి పరిష్కారం.

తేనెకు కొవ్వును కరిగించే గుణం ఉంది. ప్రతి ఉదయం ఒక గ్లాసెడు గోరువెచ్చని నీళ్లలో కాసింత తేనె కలుపుకొని తాగితే జీవక్రియలు సాఫీగా సాగుతాయి. ఒంట్లో వేడి తగ్గుతుంది.

తేనె కలిపిన నీరు తీసుకోవడం వల్ల గొంతులోని కఫం తగ్గుతుంది. జలుబు, దగ్గు ఉపశమిస్తాయి. అల్లం ముక్కను తేనెలో బాగా నానబెట్టి తింటే అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. చిన్న గ్లాసెడు నీళ్లలో అర టీస్పూన్ తేనె కలిపి పుక్కిలిస్తే నోటిలోని సూక్ష్మక్రిములు తొలగిపోతాయి. నోరు దుర్వాసన రాకుండా ఉంటుంది. అయితే.. బాగా ఎండలో తిరిగొచ్చిన తర్వాత, వ్యాయామం చేశాక తేనె తీసుకోకూడదు.

# నడుం నొప్పికి కారణాలు చికిత్సా విధానాలు

నడుం నొప్పి రెండు రకాలు..ఒకటి, అక్యూట్ లో బ్యాక్ పెయిన్ రెండు, క్రానిక్ లో బ్యాక్ పెయిన్.

క్రానిక్ బ్యాక్ పెయిన్ : నడుం నొప్పి మూడు నెలల కన్నా ఎక్కువ కాలం ఉంటే, దాన్ని 'దీర్ఘకాలిక నడుం నొప్పి' అంటారు. ప్రపంచ వ్యాప్తంగా, మనిషి వైకల్యానికి ఇది రెండో సాధారణ కారణం. ఈ సమస్య చాలామందికి వస్తుంది, వయసు పెరుగుతున్న కొద్దీ పెరుగుతుంది. వ్యక్తి జీవన విధానం మీదా, వృత్తి ఉద్యోగాల మీదా తీవ్ర ప్రభావం చూపుతుంది.

నడుం నొప్పి వివిధ కారణాలవల్ల వస్తుంది.

1. యాక్సిడెంట్స్, వెన్నుపూసకు గాయాలు, ఫ్రాక్చర్స్.
2. కండరాల స్ప్రెయిన్.
3. క్షయ వ్యాధి.
4. స్పాండిలైటిస్.
5. మానసిక ఒత్తిడి, డిప్రెషన్.
6. వెన్నుపూస ఎముకలు జారడం.

1. ప్రమాదాలతో వచ్చే నడుం నొప్పి

ప్రమాదాల్లో బలమైన దెబ్బ తగలడం వల్ల లేదా చాలా బరువైన వస్తువులను ఎత్తడం వల్ల కండరాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో.. వెన్నుపూస ఎముకలు విరగడం, వెన్ను మధ్యలోని జెల్ లాంటి డిస్కు బయటకు రావడం కూడా జరుగుతుంది.

2. ఇతర వ్యాధులతో వచ్చే నడుం నొప్పి

క్షయవ్యాధి : వెన్నుపూస ఎముకలకు క్షయ సోకడం, అవి చీము పట్టడం జరుగుతుంది. దానివల్ల వెన్నుపూస ఎముకలు అరగడం, దెబ్బతినడం జరుగుతుంది.



క్యాన్సర్: ఊపిరితిత్తుల క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వెన్నుపూసకు సోకినప్పుడు, వెన్నుపూస ఎముకలు ఫ్రాక్చర్ అవుతాయి.

3. వయసుతో వచ్చే నడుం నొప్పి: దీర్ఘకాలంగా బరువైన పనులు చేసే భవన నిర్మాణ కూలీలకు, శ్రామికులకు వెన్నుపూస, డిస్క్ అరిగే ఆస్కారం ఎక్కువ. దీనివల్ల కూడా నడుం నొప్పి వస్తుంది.

4. డిస్క్ ప్రొలాప్స్ వల్ల వచ్చే నడుం నొప్పి: నడుం నుంచి, తొడ వెనుక భాగం నుంచి.. అరికాలు పాదం వరకూ నొప్పి వస్తుంది. దీన్ని 'సయాటికా' అంటారు. డిస్క్ ప్రొలాప్స్ అరగడం, వెన్నుపూస నరాల ఒత్తిడి వల్ల జరుగుతుంది.

5. రోడ్డు ప్రమాదాలవల్ల వచ్చే నడుం నొప్పి: ఈ సమస్యతో బాధపడుతున్నవారిని విపరీతమైన నొప్పి వేధిస్తుంది. కాళ్లు కదల్చలేకపోవడం కూడా ఉంటుంది.

6. క్షయవ్యాధివల్ల వచ్చే నడుం నొప్పి: కండరాలు బాగా పట్టేసి ఉంటాయి. విపరీతమైన నొప్పి ఉంటుంది.

నిర్ధారణజి

ఎంఆర్ఐ లుంబార్ స్పైన్/ సీటీ లుంబార్ స్కాన్ చేసి వ్యాధి ఎక్కడ ఉందో, దేనివల్ల నొప్పి వస్తుందో కనుక్కోవచ్చు.

ట్రీట్‌మెంట్ : నడుం నొప్పికి చాలా కారణాలు ఉంటాయి. దాన్ని బట్టి ట్రీట్‌మెంట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. సమస్య మూలాన్ని కనిపెట్టి, దానికి తగిన ట్రీట్‌మెంట్ ఇచ్చినట్లయితే, నొప్పిని చాలావరకూ తగ్గించవచ్చు.

కన్జర్వేటివ్ థెరపీ : మందులతో చేసే ట్రీట్‌మెంట్ ఇది.

సయాటికా : డిస్క్ పొల్రాప్స్‌లో ఇచ్చే ట్రీట్‌మెంట్.

బెడ్ రెస్ట్ : మొదట అందరికీ సాధారణంగా బెడ్‌రెస్ట్ సూచిస్తాం. దీని వల్ల రోజూ చేసే పనులకు దూరంగా ఉండటం, బరువులు ఎత్తకుండా ఉండటం వల్ల నడుం నొప్పి చాలా వరకూ తగ్గుతుంది. తర్వాత ఫిజియోథెరపీ. ఇందులో హాట్ ప్యాక్స్, అల్ట్రాసౌండ్ థెరపీ ఉంటాయి. కొంచెం నొప్పి తగ్గిన తర్వాత కండరాల నొప్పి తగ్గడానికి ఎక్సర్‌సైజ్ థెరపీని సూచిస్తాం.

సర్జికల్ ట్రీట్‌మెంట్ : వ్యాధి తీవ్రతనుబట్టి సర్జరీ చేయించుకోవాల్సి ఉంటుంది. క్షయ, క్యాన్సర్ ట్యూమర్స్, వెన్నుపూస ఎముకలు జరగడం, ఫ్రాక్చర్.. వీటికి సర్జరీతో ట్రీట్ చేస్తాం.

సైకలాజికల్ ట్రీట్‌మెంట్ : మానసిక, ఒత్తిడి, డిప్రెషన్‌వల్ల వచ్చే నడుం నొప్పికి సైకలాజికల్ కౌన్సెలింగ్ అవసరం ఉంటుంది.

# భారత్ ఆస్ట్రేలియా మ్యాచ్ కు పగడ్బందీ ఏర్పాట్లు

## - ఏసీఏ కార్యదర్శి ఎస్ ఆర్ గోపీనాథ్ రెడ్డి

విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : విశాఖ వేదికగా భారత్ ఆస్ట్రేలియాల మధ్య నవంబర్ లో జరగనున్న టి 20 మ్యాచ్ కు కావలసిన ఏర్పాట్లను త్వర త్వరగా పూర్తి చేస్తున్నామని ఏసీఏ కార్యదర్శి ఎస్ ఆర్ గోపీనాథ్ రెడ్డి అన్నారు. మహా విశాఖ 6వ వార్డు పరిధి లో పీఎం పాలెం వద్ద గల డా వైయస్ రాజశేఖర్ రెడ్డి ఏసిఏ-విడిసిఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏసీఏ అధ్యక్షులు శరత్ చంద్రారెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో నవంబర్ 23 వ తేదీ న భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనున్న టి 20 మ్యాచ్ కు సంబంధించి ఏర్పాట్లను ముఖ్యంగా పార్కింగ్ సమస్య ,టికెట్లు ,శానిటేషన్, ఫుడ్ కౌంటర్స్ మొదలు వాటి విషయంలో చిన్నచిన్న లోపాలు, సమస్యలు ఎదుర్కొన్నామని అయితే ఇప్పుడు అన్ని శాఖల సమన్వయంతో వాటిని అధిగమించి మ్యాచ్ సమర్ధవంతంగా నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. అంతేకాక స్టేడియంలో పాడైపోయిన సుమారు 7000 వరకు కుర్చీలను మారుస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా లెజెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ను డిసెంబర్ 2 నుండి 4 తేదీ వరకు జరగనున్నయని ఈ టోర్నమెంట్లో ప్రఖ్యాతిగాంచిన అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారులు పాల్గొంటారని తెలియజేశారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు అంతర్జాతీయ క్రీడాకారులు తయారయ్యారని మరియు వివిధ స్థాయిలలో టోర్నమెంట్ లను లీగ్ మ్యాచ్లను సమర్థవంతంగా




నిర్వహించామని రానున్న రోజుల్లో మరింత సమర్థవంతంగా మ్యాచులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బీసీసీఐ సూచించిన అన్ని రకాల ఫార్మేట్ లో గల మ్యాచ్లను సమర్థవంతంగా నిర్వహించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. క్రికెట్ పట్ల క్రేజ్ ఎక్కువగా ఉందని దాని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే వివిధ రకాల కేటగిరీలో క్రీడాకారులను అందించామని. అందరు సహాయ సహకారాలతో రానున్న రోజుల్లో మరిన్ని మ్యాచ్లు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి చలం, అపెక్స్ ప్రతినిధులు, స్టేడియం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థాయి సంఘం సమావేశంలో అన్ని అంశాలు ఆమోదం

## - నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయి సంఘ సమావేశ మందిరంలో నిర్వహించడమైనది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం అజెండాలో 52 అంశాలతో పాటు 4 టేబుల్ అజెండా అంశాలు పొందుపరచగా మొత్తంగా 56 అంశాలను స్థాయి సంఘ సభ్యులు చర్చించి ఆమోదించడమైనదని చైర్ పర్సన్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ. 11.16 కోట్ల అభివృద్ధి పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు సందర్భాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికులు ఏర్పాటు కొరకు సుమారు. రూ. 44.06 లక్షలు, క్రీడ విభాగానికి సంబంధించి సుమారు రూ. 44.60 లక్షలు రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు పొడిగింపులు, ఉద్యోగుల ప్రొబేషన్, సర్వీస్ స్పెషల్ ఇంక్రిమెంట్లు సంబంధించిన అంశాలతో పాటు ఇతర అంశాలను సభ్యులు ఆమోదించడమైనదన్నారు.

ఈ సమావేశంలో స్థాయి సంఘ సభ్యులతో పాటు అదనపు కమీషనరు డా.వై.శ్రీనివసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, 7వ జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఎ.ఎం.ఒ.హెచ్. సి.హెచ్.సత్యనారాయణ, డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వి ఎమ్ ఆర్ డి ఎ, సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డా ఎ మల్లిఖార్జున ను మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ కె యస్ విశ్వనాథన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన దాట్ల కీర్తి.

# నడకదారిలో మళ్లీ చిరుత..

తిరుమల: అలిపిరి నడక మార్గంలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే అలిపిరి నడక మార్గంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి రిపీటర్ మధ్య ప్రాంతంలో చిరుత, ఎలుగబంటి సంచరిస్తున్న దృశ్యాలు ట్రాప్ కెమెరాలో రికార్డయింది. దీంతో నడక దారి భక్తులను తితిదే అప్రమత్తం చేసింది. భక్తులు జాగ్రత్తగా ఉండాలని, గుంపులు గంపులుగా వెళ్లాలని సూచించింది. మరో వైపు చిరుత, ఎలుగబంటిని బంధించేందుకు తితిదే, అటవీ అధికారులు చర్యలు చేపట్టారు.

# ప్లాస్టిక్ రహితంగా ఏయూ



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ప్లాస్టిక్ రహితంగా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలని ఏయూ విద్యవిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. శుక్రవారం ఏయూ మెయిన్ గేట్ వద్ద ‘ సే నో టు ప్లాస్టిక్’ నినాదంతో కూడిన పోస్టర్లను ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విభాగ విద్యార్థులు విశ్వవిద్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా-పర్యావరణహితంగా తీర్చిదిద్దుతామని నినాదాలు చేసారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఇచ్చిన పిలుపును స్వీకరిస్తూ విశ్వవిద్యాలయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రింస్తూ, పూర్తిగా తగ్గించే విధంగా విద్యార్థుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో విద్య విభాగం ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా

# ఓపెన్ హౌస్ ఆయుధాల ప్రదర్శన

## - అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

## - నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ రవిశంకర్




విశాఖపట్నం (విజయభాను న్యూస్): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు - 2023 లో భాగంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్.ఏ.రవిశంకర్ (ఐ.పి.ఎస్) పోలీసు (ఓపెన్ హౌస్) ఆయుధాల ప్రదర్శన కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం గా జరుపుకుంటున్న విషయం విదితమే, అయితే ఆ ఒక్క రోజే ఎందరో పోలీస్ సోదరులు అమరులైన మహానుభావుల త్యాగాలను స్మరించుకుంటే సరిపోదు కాబట్టి వారి యొక్క ప్రాణ త్యాగాలను గురించి ప్రజలందరికీ తెలియజేయాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను 21-10-2023 వ తేదీ నుండి 31-10-2023 వ తేదీ వరకు నగర పోలీసు కమిషనర్ డాక్టర్.ఏ.రవి శంకర్ ఆధ్వర్యంలో నగర పోలీసులు ఘనంగా నిర్వహిస్తున్నారు. నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్స్ లో మరియు ఏఆర్ పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు ఓపెన్ హౌస్(ఆయుధాల ప్రదర్శన) కార్యక్రమాన్ని నిర్వహించి,పోలీసు వ్యవస్థ పనితీరు గురించి, పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాల గురించి డాగ్ స్క్వాడ్, బాంబు డిటెక్షన్ స్క్వాడ్ విభాగం, కమ్యూనికేషన్ విభాగము, ఫింగర్ ప్రింట్స్ మరియు క్లూస్ టీం లు ప్రత్యేక స్టాల్ ను ప్రదర్శన చేసి పలు కళాశాలల , పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏడిసిపి(ఏ.ఆర్) పర్యవేక్షణలో అల్లర్ల సమయంలో గుంపుని ఏ విధముగా చెదరగొట్టేది విద్యార్థులకు వివరించి, బాష్ప వాయువు ఏ విధముగా ప్రయోగిస్తారో ప్రతక్షముగా వజ్రా వాహనం ద్వారా ప్రయోగించి చూపించారు. ఓపెన్ హౌస్ ప్రదర్శనకు విచ్చేసిన విద్యార్థులు పోలీసుల ఆయుధాలు, సాంకేతికత, విధులు తెలుసుకొని తమ విజ్ఞానాన్ని పెంచుకున్నారనీ వారి ఉపాధ్యా యులు పేర్కొంటూ కార్యక్రమం నిర్వహించిన సీపీ కి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల లో భాగంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలోగల పలు పాఠశాల లనందు,సీటీసీ నందు వ్యాసరచన



పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థినీ విద్యార్థులు మరియు పోలీస్ కుటుంబాల యొక్క పిల్లలు మరియు పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. దీనిలో విజయం సాధించిన విజేతలకు ప్రథమ బహుమతి పొందిన వారికి 5,000 రూ. ద్వితీయ బహుమతి పొందిన వారికి 3,000 రూ. తృతీయ బహుమతి పొందిన వారికి 2,000రూ, బహుమతి ప్రధానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి-1(ఎల్ అండ్ ఓ) కే.శ్రీనివాసరావు, అర్మ్డ్ రిజర్వ్ ఏడిసిపి, ఎసిపి లు, అర్.ఐ లు, పి.ఆర్.ఓ,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# నాణ్యమైన ప్రీమియం కాల్టెక్స్ ఉత్పత్తులను భారత్ కు తీసుకురావడం ఆనందంగా ఉంది

## హెచ్.పి.సి.ఎల్,చెవ్రాన్ భాగస్వామ్యంతో భారత్ లో ప్రారంభించనున్న కాల్టెక్స్ లూబ్రికెట్లు



విశాఖపట్నం(విజయభాను న్యూస్): నాణ్యమైన ప్రీమియం కాల్టెక్స్ ఉత్పత్తులను భారత్ కు తీసుకురావడం ఆనందంగా ఉందని చెవ్రాన్ ఇంటర్ నేషనల్ ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డేనియల్ లింకన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేము నాణ్యమైన మరియు ప్రీమియం కాల్టెక్స్ ఉత్పత్తులను భారతదేశానికి తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. హెచ్‌పిసిఎల్ భారతదేశంలో మార్కెట్ లీడర్, వారితో కలిసి మేము కాల్టెక్స్ బ్రాండ్ బలంతో ఇంకా మా ప్రీమియం ఉత్పత్తి పోర్ట్ఫోలియోను నిర్మించాలని ప్లాన్ చేస్తున్నాము. హెచ్‌పిసిఎల్‌తో సుదీర్ఘమైన ఇంకా విజయవంతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాలని మేము ఎదురుచూస్తున్నాము, భారతదేశంలోని చెవ్రాన్ తన స్వంత ఉత్పత్తులైన హవోలిన్ మరియు డెలో ఉత్పత్తి శ్రేణితో సహా కాల్టెక్స్ ప్రీమియం ఉత్పత్తులతో వారి ఉత్పత్తులను అనుసంధానిస్తుంది అన్నారు. సువిశాల 17.5 ఎకరాల విస్తీర్ణంలో, సిల్వాస్సాలో ఉన్న హెచ్‌పిసిఎల్ వారి అత్యాధునిక తయారీ కేంద్రం కాల్టెక్స్ లూబ్రికెంట్ల ప్రీమియం శ్రేణిని తయారు చేస్తుంది. అత్యాధునిక సదుపాయం హెచ్‌పిసిఎల్ వారి సాంకేతిక పురోగతి మరియు పర్యావరణ స్థిరత్వానికి సంబంధించిన నిబద్ధతను ఉదహరిస్తుంది. ప్లాంట్ ఐ ఎస్ ఓ 9001/14001/45001 /50001 అనుగుణంగా ఇంకా 75 టికెల్స లూబ్రికెంట్ నూనెలను ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

హెచ్‌పిసిఎల్ డైరెక్టర్ - మార్కెటింగ్, అమిత్ గార్గ్ కొనసాగిస్తూ “హెచ్‌పిసిఎల్ మరియు చెవ్రాన్ మధ్య సహకారం, భారతదేశంలో హెచ్‌పి లూబ్రికెంట్స్ మార్కెట్ నాయకత్వ స్థానాన్ని మరియు చెవ్రాన్ యొక్క ప్రపంచ స్థాయి వారసత్వం, విస్తృతమైన ప్రీమియం ఉత్పత్తుల ద్వారా భారతీయ వినియోగదారులకు మరింత మహత్తరమైనవి అందించడానికి సంసిద్ధంగా ఉంది. చెవ్రాన్‌తో మా దీర్ఘకాలిక సహకారం లూబ్రికెంట్లు మరియు గ్రీజుల ఉత్పత్తి, పంపిణీ మరియు మార్కెటింగ్‌లో హెచ్‌పిసిఎల్ నైపుణ్యంతో కట్టుబడిఉంది. నేటి ప్రపంచంలో, ఆధునిక ఇంజిన్‌లు వాహనదారులకు తమ పూర్తి సామర్థ్యాన్ని అందించేందుకు ఉత్తమ స్థాయి ఇంజిన్ ఆయిల్ పనితీరును కోరుతున్నాయి. హెచ్‌పిసిఎల్ మరియు చెవ్రాన్ పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటమే కాకుండా, ఉన్నతమైన ఫలితాలను అందజేసే ప్రీమియం ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను అందించడానికి కట్టుబడి ఉన్నాయన్నారు. చమురు మరియు గ్యాస్ పరిశ్రమల రంగాలలో అగ్రగామిగా ఉన్న హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) మరియు చెవ్రాన్ కార్పొరేషన్ యొక్క అనుబంధ సంస్థ అయిన చెవ్రాన్ బ్రాండ్స్ ఇంటర్నేషనల్ ఎల్ఎల్‌సి (చెవ్రాన్)తో భారతదేశంలోని చెవ్రాన్ వారి హవోలిన్ మరియు డెలో బ్రాండెడ్ లూబ్రికెంట్ ఉత్పత్తులతో పాటు కాల్టెక్స్ బ్రాండ్ క్రింద చెవ్రాన్ వారి లూబ్రికెంట్ ఉత్పత్తుల లైసెన్సింగ్, ఉత్పత్తి, పంపిణీ ఇంకా మార్కెటింగ్‌తో కూడిన దీర్ఘకాలిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కాల్టెక్స్ అనేది చెవ్రాన్ బ్రాండ్ల కుటుంబంలోని భాగం. కాల్టెక్స్ ప్రపంచవ్యాప్త గుర్తింపు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రపంచంలోని ప్రముఖ చమురు మరియు గ్యాస్ బ్రాండ్లలో ఒకటిగా ఉంది, దాని ఉత్పత్తుల శ్రేణిని రిటైల్ చేసే వ్యాపారాలకు విలువను జోడిస్తుంది. యునైటెడ్ స్టేట్స్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన రెండవ అతిపెద్ద చమురు మరియు గ్యాస్ కంపెనీ చెవ్రాన్, 150 కంటే ఎక్కువ దేశాలలో వీటి ఉత్పత్తులు అమ్ముడవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 10 కార్యాలయాలు ఇంకా 25 బ్లెండింగ్ ప్లాంట్‌లతో చెవ్రాన్ ఫినీష్డ్ లూబ్రికెంట్‌ల గ్లోబల్ మార్కెటర్.

ఈ రోజు జరిగిన ప్రారంభోత్సవంలో, చెవ్రాన్ ముంబైలోని గొప్ప చారిత్రాత్మక ‘గేట్వే ఆఫ్ ఇండియా’ స్మారకాన్ని భారతదేశంలోకి ప్రవేశాన్ని సూచించే అద్భుతమైన విజువల్స్ కాన్వాస్‌గా మార్చివేసింది. అద్భుతమైన గ్రాఫిక్స్ ప్రొజెక్షన్ ఈ వారసత్వ ప్రదేశాన్ని దేశంలోని సమకాలీన ప్రకృతి దృశ్యానికి నివాళిగా మార్చింది, అంతేకాక సాంస్కృతిక ప్రభావంలో లీనమైపోయింది.

ఈ స్మారక ప్రదర్శన భారతదేశ పురోగతి పట్ల బ్రాండ్ యొక్క నిబద్ధతను తెలిపింది, దాని ప్రధాన ఇతివృత్తమైన ‘కాల్టెక్స్ అంటే నిబద్ధత’ గా ప్రతిబింభించింది. హెచ్‌పిసిఎల్ దాని జాయింట్ వెంచర్ కంపెనీల ద్వారా, భటిండా మరియు మంగళూరులో రిఫైనరీలను నిర్వహిస్తోంది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com